honeybee.org
Vol-7 Issue-2

సంపుటి 7 సంచిక 2 జనవరి - ఫిబ్రవరి 2019

# పల్లెసృజన

www.pallesrujana.org

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక








# అందుకే ఈ శోధన




'ముల్లా నసీరుద్దీన్' చాలా ప్రఖ్యాతి గాంచిన వ్యక్తి. ఒకరోజు ఒక రైతు ఆయనవద్దకు వచ్చి "అయ్యా, ఈ సంవత్సరం ఆలివ్ పళ్ళు కాస్తాయంటారా?" అని అడిగాడు. "తప్పకుండా కాస్తాయ"న్నాడు నసీరుద్దీన్. "మీకెలా తెలుసు?" అన్నాడు రైతు. "నాకు తెలుసు అంతే" అన్నాడాయన.

తర్వాత ఒకరోజు అదే రైతు నసీరుద్దీన్ సముద్రపు ఒడ్డున కొట్టుకొచ్చిన కట్టెల కోసం గాడిదను తోలుకుంటూ వెళ్ళటం చూసి "అయ్యా నసీరుద్దీన్ ఇక్కడేం కట్టెలు లేవు నేను చూశాను" అన్నాడు. ఐనా నసీరుద్దీన్ గాడిదను తోలుకుంటూ అలాగే వెళ్ళిపోయాడు. కొన్ని గంటల తర్వాత నసీరుద్దీన్ ఒక చెక్క ముక్క కూడా దొరకక పోవటంతో నీరసంగా తిరిగి రావటం గమనించిన అదే వ్యక్తి ఆయనతో "అయ్యా మీరు ఆలివ్ పళ్ళు కాస్తాయో లేదో చెప్పగలిగే శక్తి వున్నవారు, కానీ సముద్రపు ఒడ్డున చెక్కలు దొరుకుతాయో లేదో చెప్పలేక పోయారేంటి?" అని అడిగాడు. దానికాయన "నాకు ఏది వుంటుందో తెలుసు కానీ, ఏది బహుశా వుంటుందో తెలీదు" అన్నాడు.

**ముల్లాగారు చెప్పిన దాంట్లో చాలా నిగూడమైన సత్యముంది. ఏమవుతుందో తెలియకపోతే అదొక అర్థవంతమైన ప్రయాణం అవుతుంది. ఒకవేళ తెలిసినా పరిపూర్ణంగా తెలియదు. తుఫాను వస్తుందని తెలుసు. ఎంత తీవ్రతతో వస్తుందో తెలియదు. మూలికా వైద్యం పని చేస్తుందని తెలుసు కాని ఎంత బాగా పని చేస్తుందో తెలియదు. ఇలాంటి సవాళ్ళు ఎన్నో మనం ఎదుర్కొంటూనే ఉంటాం. అయినా మన ప్రయత్నాలు మానం. పరిష్కారాలు ఉన్నా, అనిశ్చిత పరిష్కారాలు వెతకడం సాహసోపేతంగా ఎందుకు ఉంటుంది? కారణాతీతమైన పరిష్కారాలను ఇన్నోవేటర్లు వెతకడానికి ప్రేరణ ఏమిటి? ఏ శక్తి వారిని ముందుకు తీసుకు వెళ్తుంది?**

**– హనీబీ 19(1) – 2008**

Vol-7, Issue - 2 January - February 2019



# పల్లెసృజన

సంపుటి-7 సంచిక - 2 జనవరి - ఫిబ్రవరి 2019

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్– 500 094.
ఫోన్ : 040–27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit at :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్,**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త,**
**పి. చంద్రకాంత్ శర్మ,**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్,**
**జమ్మలమడక శ్రీకర్,**

కార్టూన్స్ : **వెంకట్**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail :
narendragrafixhyd@gmail.com

**Rs. 800/-**
**for 5 years Subscription**

## విషయ సూచిక


చేనేత కార్మికుల కష్ట నివారణకై 'యజ్ఞం' చేసిన శివకుమార్ 3



12



జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

విల్లూరి శేషగిరి వంటపాత్రల వాషింగ్ మిషన్ 18



9వ జాతీయ ద్వైవార్షిక పోటీలు
బహుమతి పొందిన ఇన్నోవేషన్లు 22



26



రైతులకు సేంద్రియ ఎరువు సరఫరాకై ప్రసాద్ ప్రయత్నం

ఇతర రాష్ట్రాల పల్లె కబుర్లు 28



30



ఆయుర్వేద జ్ఞాన మథనం
తులసి - సకల సద్గుణ రాశి

కవర్ లోపలి పేజీల్లో ... **అందుకే ఈ శోధన** హనీబీ కథ, అమ్మకానికి సిద్ధంగా వున్న 'గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్'

మధ్య పేజీల్లో : **'పల్లెసృజన' పాల్గొన్న ప్రదర్శనలు**


Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix,** 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Num Valli Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# దేశానికి 'విత్తన స్వాతంత్ర్యం' అవసరం

విత్తనం ప్రపంచానికి మూల ఆధారం. విత్తు లేకపోతే జీవం లేదు, చెట్టు లేదు, మనిషి మనుగడ లేదు. వాతావరణానికి నియంత్రణ ఉండదు. జీవ జంతువులకు కూడు, గూడు ఉండదు. విత్తనం లేకపోతే ప్రపంచమే లేదు అనవచ్చు. అంత ముఖ్యమైన విత్తనానికి, మన జీవితాలే ఆధారపడి వున్న విత్తనానికి మనం ఎంత ప్రాధాన్యతను ఇస్తున్నామో ఒక్కసారి గమనించాలి.

ప్రస్తుతం విత్తనాలు పరిశ్రమగా మారాయి. పరిశ్రమలు ప్రజలకై పని చేయవు. ప్రధానంగా పెట్టుబడిపై లాభాలు సంపాదించడానికే పని చేస్తాయి. విత్తనాలు విశిష్టమైనవి. వాటి ప్రత్యేకత ఏమిటంటే.... అవి మొలకెత్తడం అన్నది ఆయా ప్రాంత వాతావరణం, నీటి లభ్యత, సూర్యరశ్మి, ఎత్తుపల్లాలు, గాలిలో తేమ, పరిసరాల్లోని జీవ వైవిధ్యంపై ఆధారపడి ఉంటుంది. 'దేశమంతా ఒకే విత్తనం' అన్న పారిశ్రామిక సైంటిఫిక్ సంస్థల ఉద్దేశ్యం సరియైనది కాదు. ఈ విధానంతో మన రైతులు ఎంతో కోల్పోయారు. 'హైబ్రిడ్ విత్తనాలతో అధిక దిగుబడి' అన్న పద్ధతిలో పర్యవసానాలు ఎంత నష్టకరంగా ఉన్నాయో అందరికీ విదితమే. ఈ విధానాన్ని మనం ఇలాగే కొనసాగిస్తే ఆహార బానిసత్వానికి దారితీస్తుందని ఖచ్చితంగా చెప్పవచ్చు. ఈ బానిసత్వం రాకుండా ఉండాలంటే విత్తన స్వాతంత్ర్యం, ఎరువు స్వాతంత్ర్యం మరియు చీడ పురుగుల నుండి స్వాతంత్ర్యంకై పాటుపడాలి.

దేశం నలుమూలల్లో వ్యక్తిగతంగా రైతులు, సామూహికంగా స్వచ్ఛంద సంస్థలు స్థానికంగా లభించే విత్తనాల పరిరక్షణ, ఉత్పత్తి, సరఫరా లాంటి ఉపయోగకరమైన ప్రక్రియలను చెపట్టారు. ఒక ఉద్యమంగా దేశమంతా ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయి. విత్తనాల బానిస శృంఖలాలను త్రెంచుకోవాలన్న ఈ దేశవ్యాప్త ఉద్యమానికి ప్రభుత్వం సహకరించడం ప్రారంభమైంది. ఆదివాసులు ఇంకా విత్తనోత్పత్తి, వాటి విస్తరణలో చాలావరకు విత్తన స్వతంత్ర్యాన్ని కాపాడుకుంటున్నారు. వీరి ఉత్పత్తులను చట్టబద్ధం చేయడానికి తగిన అధికారాలను, అర్హతలను ప్రభుత్వం 'వేరువేరు జాతుల మొక్కల సంరక్షణ, రైతుల హక్కుల చట్టం 2001' క్రింద చట్టబద్ధం చేసింది. 2005లో ఈ చట్టం అమలు చేయడానికి ఒక సంస్థను (PVFRA) ఏర్పరచింది. ఈ సంస్థకు మొక్కల సంరక్షణ, రైతుల హక్కుల విషయంలో తుది నిర్ణయం చేసే అధికారం ఉంది. విత్తనాలు, క్రొత్త మొక్కలు తయారు చేసే రైతులకు స్వచ్ఛంద సంస్థలకు రైతేతరులకు అన్ని విధాలా సహకారం, ప్రోత్సాహం, హక్కుల రక్షణ ఇస్తుంది. ముఖ్యంగా రైతులకు ప్రోత్సాహం ఇవ్వటానికి, రిజిస్ట్రేషన్ ఖర్చులు తగ్గించడం, సులభంగా వారి విత్తనాలను నమోదు చేయడం, వాటికి పేటెంటు హక్కులు, ఆర్థిక సాంకేతిక సహాయం అందజేస్తుంది. మరిన్ని వివరాలకు http://plantauthority.gov.in వెబ్‌సైట్ ను దర్శించండి. పల్లెసృజనను కూడా సంప్రదించవచ్చు.

స్వచ్ఛంద సంస్థలు విత్తనోత్పత్తిలో రైతుల స్వేచ్ఛ, అధికారాలకై నిర్విరామంగా పాటు పడుతున్నాయి. హైదరాబాదులోని దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డిడిఎస్) గత 25 సంవత్సరాలుగా చిరుధాన్యాల అసలు సిసలైన విత్తనాల సంరక్షణ, విత్తనోత్పత్తి విస్తరణకై అద్భుత కృషి చేస్తున్నది. 'వృహి' సంస్థ 1400 కు పైగా జానపద (గిరిజనుల సాంప్రదాయ) వరి విత్తనాలను కాపాడి రైతుల మధ్య ఉచిత సరఫరాను సాధిస్తున్నది. మహిళా రైతుల ద్వారా 'గ్రీన్ ఫౌండేషన్' వందకు పైగా విత్తన రకాలను కాపాడ గల్గింది. కర్ణాటకలోని 'వనస్త్రీ' సంస్థ 120 రకాల కూరగాయల విత్తనాలను పంచి మహాడ్ ప్రాంతంలో ఇంటిపంటలను ప్రోత్సహిస్తున్నది. మహారాష్ట్రలో 'బిఐఐఎఫ్' సంస్థ 400కు పైగా దేశవాళీ విత్తనాలు విస్తరింపజేస్తున్నది. 'బీజ్ బచావ్' ఆందోళన హిమాచల్ ప్రదేశ్‌లో 250 రకాల స్థానిక 'రాజమా' విత్తనాల విస్తరణకు పూర్తి సహకారం అందిస్తున్నది.

విత్తన స్వాతంత్ర్యానికై ఇంకా ఎంతో చేయవలసి ఉంది సమాజంలోని అన్ని వర్గాలు ప్రభుత్వాలు ఏకమై ఈ ఉద్యమాన్ని వేగవంతం చేయాలి. ఈ ప్రయత్నాలలో ముఖ్యమైన అంశాలను పల్లెసృజన ఈ క్రింది విధంగా రూపొందించింది.

1. విత్తనాల విషయంలో జ్ఞాన విస్తరణ, విత్తన నిల్వ, వితరణలపై రైతులకు సరియైన అవగాహన,
2. విత్తనాల విస్తరణలో కార్పోరేట్ పద్ధతులను విసర్జించడం.
3. దేశం 'విత్తన స్వాతంత్ర్యం' ఒక ప్రధాన అంశంగా పరిగణించేలా చేయడం.
4. హైబ్రిడ్ విత్తనాలు సేంద్రీయ వ్యవసాయానికి సరియైనది కావని తెలియజేయటం.
5. స్థానిక విత్తనాలు వాడిన రైతులకు కూడా పంట బీమా అమలు చేయడం.
6. వికేంద్రీకరణ ద్వారా సాంప్రదాయ పద్ధతుల విస్తరణ.
7. దేశవాళీ విత్తనాలు, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అమలైతే, వ్యవసాయ కళాశాలల్లో బోధన ఎలా ఉండాలి? వాటి పాత్ర ఏమిటి?
8. సేంద్రియ వ్యవసాయం, దేశవాళీ విత్తన ఉద్యమాలు చేతులు కలిపి ముందుకు సాగాలి.
9. పిపివిఎఫ్ఆర్ఎ మరియు జాతీయ జీవ వైవిధ్య సంస్థ ఏకదిశగా నడవాలి.
10. రైతులు కనిపెట్టిన విత్తనాలు, మొక్కల రకాలను వెతకడానికి జాతీయ స్థాయిలో ప్రయత్నం జరగాలి.
11. ప్రభుత్వ పాలసీలు, విధానాలు, అర్హతలు, ఆంక్షలు అన్నీ రైతులకు వారి మాతృభాషల్లో అందించాలి.
12. ప్రతి గ్రామంలో స్కూలు విద్యార్థులతో ఆ గ్రామ వ్యవసాయ వైవిధ్యం గురించి సర్వే చేయించి ఉపాధ్యాయులు గ్రంథస్తం చేయాలి. గత 50 సంవత్సరాల్లో ఆ గ్రామాల్లో పండించిన వివిధ రకాల పంటల గురించిన వివరాలను నమోదు చేయాలి.
13. వివిధ సంస్థలు, సమాజ వర్గాలు, స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న ప్రయత్నాలను, ఈ సమాచారం (డాటా)ను ఒక్కచోట సమీకరించి జాతీయ జ్ఞానకోశాన్ని ఉచితంగా దేశ ప్రజలకు అందేలా చేయాలి.



పైన వివరించిన అంశాలు మన దేశాన్ని విత్తన స్వాతంత్ర్యం దిశగా తీసుకొని వెళ్తాయి, స్వావలంబనకు దారి తీస్తుంది. ఏ దేశంలో ఆహారం పరుల నియంత్రణ జరుగుతుందో ఆ దేశం బానిస కావడానికి సిద్ధమైందన్నమాట. మన దేశాన్ని, వచ్చే తరాలను మరోసారి బానిసలుగా కాకుండా చేయాలంటే మనమంతా

'విత్తనం పంటకు ఆత్మ' అని ,
'రైతు పంటకు వెన్నెముక' అని
'పొలం పంటకు శరీరం' అని .....

చిత్తశుద్ధిగా నమ్మి మన ఆత్మలను కాపాడుకోవడానికి సర్వ శక్తులు సమీకరిస్తే దేశ భవిష్యత్తు, రైతుల జీవితాలు తప్పక సుభిక్షంగా ఉంటాయని పల్లెసృజన విశ్వసిస్తున్నది.

భవదీయ
బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

# చేనేత కార్మికుల కష్టాల నివారణకై 'యజ్ఞం' చేసిన శివకుమార్




- పల్లె వీరరాఘవ రెడ్డి

అనంతపురం జిల్లా, హిందూపురం లోని ఒక పాఠశాలలో వాచ్‌మెన్ ఉద్యోగం చేసే అంజనప్ప, అదే పాఠశాలలో ఆయాగా పనిచేసే జయలక్ష్మి గార్ల ప్రథమ పుత్రుడు శివకుమార్ కారణజన్ముడు అని చెప్పేందుకు 'పల్లెసృజన'కు ఏమాత్రం సంశయం లేదు. "లోకాః సమస్తా సుఖినోభవంతు ఆ వేదం మా యెద నాదం" అని ఒక కవి సినీగేయాన్ని వ్రాశాడు. లోక సంరక్షణార్థం ఎన్నో యజ్ఞాలు, యాగాలు ఎందరో మహానుభావులు చేశారని పురాణాల్లో విన్నాం. కానీ లోకహితం కోసం, ఒక సామాజిక వర్గం జీవన విధానంలో సమూలంగా మార్పు తెచ్చేందుకు ఈ కాలంలో కూడా యజ్ఞాలు చేసేవారు ఉన్నారు అని నిర్వివాదంగా చెప్పే కథే ఇప్పుడు మీరు చదవబోయే శివకుమార్ గాథ.

2000 సంవత్సరంలో డిగ్రీ పూర్తయింది. ఐసెట్ కోచింగ్ తీసుకుని పరీక్ష కూడా వ్రాశాడు మంచి ర్యాంకు కూడా సాధించాడు. తన తండ్రి కోరిక మేరకు ఎం.సి.ఏ. చదవాలని సిద్ధమవుతున్నాడు. ఒకరోజు తన తండ్రిగారి స్వంత ఊరు హిందూపురం ప్రక్కనున్న చేనేత ప్రధాన వృత్తిదారులు గల 'మొద' అనే గ్రామానికి తండ్రితోపాటు వెళ్ళటం జరిగింది. అంతవరకు శివాకు మగ్గం అంటే ఏమిటో కూడా తెలియదు. నాన్నగారు తన మిత్రులతో గడుపుతుండగా ఇతను ఒక మగ్గం నేసే అతనివద్ద కూర్చుని దాని పనితీరును గమనించ సాగాడు. ఆ నేత కార్మికుడి మాటల్లో 'ఈ మగ్గానికి 'జాకార్డ్' అనే ఒక ఇన్‌పుట్ డిజైన్ వుంటుంది. దాని వల్ల చీరపై కావలసిన డిజైన్ వస్తుంది' అని తెలుసుకున్నాడు. అప్పుడు మగ్గానికి పైన వున్న జాకార్డ్ పరికరాన్ని గమనించాడు. చీరపైన వచ్చే డిజైన్ వ్యూహం మొత్తం ఈ జాకార్డ్‌లో నిక్షిప్తం చేయబడి వుంటుందని అర్థమైంది. అక్కడ చిన్న చిన్న అట్టముక్కలకు అక్కడక్కడా రంధ్రాలు చేయబడి వుండటాన్ని చూపించి వాటిని గురించి అడుగగా, ఆ నేతకారుడు "ఈ రంధ్రాల ద్వారా వచ్చే దారం వల్లనే చీరపైన డిజైన్ ఏర్పడుతుంది. ఈ అట్టముక్కలను



జాకార్డ్ డిజైన్ అట్టముక్కలు

జాకార్డ్‌కు అందించడం వల్లనే చీరపైన కావాల్సిన డిజైన్ వస్తుందని వీటిని 'పంచ్ కార్డ్స్' అంటారని" తెలుసుకున్నాడు. ఇవి చీరపైన వచ్చే డిజైన్‌ను బట్టి ఒక్కోసారి వేల సంఖ్యలో కూడా వుంటాయి.

ప్రతి డిజైన్‌కు ఈ పంచ్ కార్డ్ అట్టముక్కలు కాకుండా ఏదైనా ఎలక్ట్రానిక్ పద్ధతి లేదా? అని అడిగాడు శివకుమార్. ఇదంతా 2003లో జరిగిన చర్చ. అందుకు చేనేతకారుడు "ఇంత వరకు అలాంటి పరికరమేదీ రాలేదు, ఒకవేళ వస్తే మాత్రం మా చేనేత కార్మికుల తలరాతలే మారిపోతాయి" అన్నాడు. అప్పుడే శివకుమార్ మదిలో ఒక దృఢ నిర్ణయం చేసుకున్నాడు. తాను ఎంసిఏ చదివే బదులు ఇలాంటి ఒక ఎలక్ట్రానిక్ పరికరం తయారు చేస్తే ఇటు చేనేత కార్మికుల తలరాతలు మారుతాయి, తనకు కూడా ఒక ఖ్యాతి దక్కుతుంది అని 'సంకల్పం' చేసుకుని ఆ మాటనే తన తండ్రితో అన్నాడు. తండ్రి ఇతని మాటలు వినక నీవు చదువుకోమంటే ఇవన్నీ నీకెందుకు అని చెప్పగా, తాను తప్పక ఈ పరికరాన్ని సాధిస్తాను అని తండ్రితో వాదించాడు శివకుమార్. కొడుకు పద్ధతి నచ్చక పోవటంతో తండ్రి ఇతనితో మాట్లాడటమే మానేశాడు. ఒకరోజు తన కొడుకుకు విద్య నేర్పిన ఒక ఫిజిక్స్ గురువు వద్దకు వెళ్ళి, తన కొడుకు ఎంసిఏ చదవమంటే ఏదో చేనేత కార్మికులకు అవసరమైన ఒక పరికరాన్ని రూపొందిస్తానని మొండి పట్టు పడుతున్నాడు మీరైనా చెప్పండి అని కోరాడు. అందుకు ఆ గురువు "శివా గురించి నాకు బాగా తెలుసు, వాడు అనుకున్నది సాధించే రకం, నీవు అతని ఇష్టానికి వదిలెయ్, అనుకున్నది సాధిస్తాడు, నీవేం బెంగ పెట్టుకోకు" అని తండ్రి అంజనప్పను సముదాయించి పంపాడు. ఈ మాటలకు కూడా కరగని తండ్రి మనసు ఇక వీడికి చెప్పేవారు ఎవరూ లేరు, నా మాట వినడు అని కొడుకుతో ఇక మాట్లాడకూడదనే నిర్ణయించుకున్నాడు.

తండ్రి తనతో మాట్లాడకున్నా, తాను అనుకున్నది సాధిస్తే గర్వపడేది ముందుగా తల్లిదండ్రులే కదా అని ఆలోచించి, ఇక తను అనుకున్నది సాధించే కార్యక్రమానికి ఉద్యుక్తుడైన శివకుమార్ తాను అనుకున్న పరికరంపై దృష్టి సారించాడు. మొదట అసలు ఈ జాకార్డ్ అంటే ఏమిటి దాని పనితీరు ఏమిటి? పంచ్ కార్డ్‌లు ఏమిటి? వాటిపై ఏర్పాటు చేసిన రంధ్రాల ద్వారా చీరకు డిజైన్ ఎలా వస్తుంది అని క్షుణ్ణంగా తెలుసుకోవటం ప్రారంభించాడు. కొంత వరకు అర్థమైంది. పూర్తిగా అర్థం కావాలంటే అసలు మగ్గం గురించిన పూర్తి సమాచారం తెలిస్తే తప్ప దీనికి పరిష్కారం లభించదు అని తెలుసుకున్నాడు. వెంటనే తాను ఎక్కడైతే మగ్గం చూసాడో అతని వద్దకే వెళ్ళి దాదాపు ఒకటిన్నర రెండు సంవత్సరాల పాటు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు వుండి మగ్గం నేయటం నేర్చుకున్నాడు. అప్పుడు ఆ మగ్గం, జాకార్డ్, పంచ్ కార్డ్‌ల పనితీరు అతనికి పూర్తిగా అవగాహన అయింది. అసలు మగ్గం అంటే ఏమిటో తెలియని ఒక వ్యక్తికి చేనేత కార్మికుడి కష్టం, నష్టం గురించి తెలుసుకోవటం, మగ్గం నేర్చుకోవటం అన్నది వింటుంటే 'ఇదంతా కేవలం దైవేచ్ఛ'లాగా అనిపిస్తుంది.

ఆ తర్వాత 2004 సంవత్సరంలో కొడుకుపై దిగాలుతోనో ఏమో కాని ఆరోగ్యం సన్నగిల్లి తండ్రి అంజనప్ప హృద్రోగంతో మృత్యుఒడికి చేరిపోయాడు. కొద్దిరోజులలోనే తండ్రి మరణం నుంచి తేరుకుని మళ్ళీ తన పనిని హిందూపురం పట్టణం నుండే చేయటానికి పూనుకున్నాడు.



ఈ చిత్రంలోని వృత్తంలో గలవే జాకార్డ్ అట్టముక్కలు. ఒక్క చీర నేయాలంటే ఇన్ని వేలాది అట్టముక్కలుండాలి.

ఇతను చేస్తున్న పనిని చూసి తన చుట్టుప్రక్కల వారు ఎగతాళిగా నవ్వుకునేవారు. ఎన్నో ఏండ్ల తరబడి ఈ పద్ధతి కొనసాగుతోంది, ఇంతవరకు ఏ ఇంజనీర్లు చేయని పనిని నువ్వెలా చేస్తావు, నీతో అయ్యేదేనా ఎందుకీ వృధా శ్రమ అని నిరుత్సాహ పరచడం మొదలు పెట్టారు.

ఆ సమయంలోనే కేంద్ర చేనేత శాఖ కూడా ఈ జాకార్డ్ పద్ధతిని మార్చేందుకు కొన్ని ప్రయత్నాలు చేస్తోందని తెలుసుకున్నాడు. ప్రభుత్వం వారే ఎన్నోరోజులుగా ప్రయత్నిస్తుంటే కావటం లేదు, నువ్వెలా చేస్తావని ఇంకా మనసు విరిగేలా తోటివారు నిరుత్సాహ పరిచారు. తనను తక్కువగా చూడటం, ఛీత్కరించటం జరిగింది. ఇలా ఒక రెండు సంవత్సరాలు గడిచింది. ఈ సూటిపోటి శల్య సారథ్యాల మధ్య ఈ పని చేయటం సాధ్యం కాదని 2006వ సంవత్సరం దసరా పండుగ అయిపోయిన వెంటనే తన తల్లితో 'అమ్మా ఇక్కడ ఈ నిరుత్సాహ పరిచే మాటలు, మనుషుల మధ్య నేను అనుకున్నది సాధించలేను, కాబట్టి నేను బెంగుళూరు లేదా హైదరాబాద్ వెళ్ళిపోతున్నాను. దీన్ని సాధించే వరకు నేను హిందూపురంలో అడుగు పెట్టను. మన


జాకార్డ్ అట్టముక్కలు అవసరం లేకుండా పని చేస్తున్న మగ్గం


ఇది శివకుమార్ తయారు చేసిన ఎలక్ట్రానిక్ జాకార్డ్

కుటుంబానికి ఒక గౌరవం తెచ్చేలా ఈ పరకరాన్ని తయారు చేసుకునే వస్తాను' అని తల్లివద్ద ఆశీర్వాదాలు తీసుకుని బయలుదేరాడు. నాటినుండి నేటివరకు తల్లిని, చెల్లిని, తమ్ముడిని ఎవ్వరినీ ఇంతవరకు (2019) కలవనే లేదు.

నాడు ఇంటినుండి బయలుదేరి హైదరాబాద్ చేరుకుని దానిపైనే ప్రయోగాలు చేసుకుంటూ తన పరికరానికి తానే మార్పులు చేర్పులు చేసుకుంటూ తన కలల పరికరానికి రూపకల్పన చేయటం ప్రారంభించాడు శివకుమార్. మొత్తానికి 2015లో తాను అనుకున్న విధంగా పరికరం తయారైంది. ఇంతకాలం ఎందుకు పట్టింది? అన్నదానికి సమాధానం చెపుతూ....

1801లో అంటే 218 సంవత్సరాల క్రితం ఇంగ్లాండుకు చెందిన 'జోసెఫ్ జాకార్డ్' అనే ఒకతను ఈ 'పంచ్ కార్డ్ జాకార్డ్'ను తయారు చేశాడు. అతని పేరుపైననే ఈ జాకార్డ్ ఇప్పటికీ కొనసాగుతూనే వుంది. ఇందులో మనకు కంటికి కనిపించని విధానాలు ఎన్నో వుంటాయి. కాబట్టి ఎలక్ట్రానిక్‌గా దీన్ని తయారు చెయ్యటంలో ఆ కంటికి కనపడని ఎన్నో విధానాలు అవరోధంగా మారాయి. శివకుమార్ ఈ పనులను కూడా నిశితంగా గమనించి వాటిని కూడా తన ఎలక్ట్రానిక్ పరికరంలో చేర్చడం జరిగింది. వీటిని కొందరు శాస్త్రవేత్తలు కూడా చూశారు కానీ, వాటికి పరిష్కారం కనుగొనలేక పోయారు. జాకార్డ్ చేసిన పనిని అందులో కనిపించని (హిడెన్) పనులను ఇందులో చేర్చటం దాదాపు అసాధ్యమని అనుకున్నాడు. వాటికి పరిష్కారం మాత్రం ఎవరివద్ద లేదని తెలుసుకున్నాడు. మొదట తయారు చేసిన

పరికరం కొన్నిరోజులు బాగా పనిచేసింది ఆ తర్వాత యంత్రంలోని కొన్ని ఎలక్ట్రానిక్ విభాగాలు చెడిపోవటం గమనించాడు. దీనికి కారణం తెలియని 'హిడెన్ ఫోర్సెస్' వున్నాయని అనుకున్నాడు శివకుమార్. ఈ సమస్యను అధిగమించేందుకు ఒక కేంద్రీయ విభాగం (సెంట్రల్ యూనిట్) డిజైన్ చేశాడితను. దాన్ని వెంటనే పేటెంటు కూడా చేసుకున్నాడు. ఇప్పుడు తాను తయారు చేసిన కేంద్రీయ పరిష్కారం (సెంట్రల్ సొల్యూషన్) ద్వారా అన్ని రకాల హిడెన్ ఫోర్సెస్‌ను ఎదుర్కొని ఈ యంత్రం పని చేస్తుంది. దీనికి సంబంధించిన ఒక ఎలక్ట్రానిక్ సిస్టంను కూడా పేటెంటు చేయటం జరిగింది. ఈ రెండింటిని అమర్చటం వల్ల జాకార్డ్ తక్కువ ధరలోనే నేత కార్మికుడికి అందుతుంది. ఈ జాకార్డ్‌లో మెకానికల్ సిస్టంతో పాటు ఎలక్ట్రానిక్ సిస్టం కూడా వుంటుంది.

మన దేశంలో కొందరు శాస్త్రవేత్తలు ఈ ఎలక్ట్రో మెకానికల్ సిస్టం తయారు చేశారు కానీ, వాటితో పోలిస్తే తాను తయారు చేసిన పద్ధతి చాలా తక్కువ ఖరీదులోనే వుంటుందని చెప్పాడు శివకుమార్. వారు తయారు చేసినవన్నీ






శివకుమార్‌కు సహకరించిన మిత్ర బృందం

చాలావరకు వైఫల్యం చెందినవే. కానీ తాను తయారు చేసిన ఎలక్ట్రానిక్ జాకార్డ్ అన్ని రకాల పనులను సమర్థవంతంగా చేస్తుంది. దానికి తోడుగా కేవలం రూ. 50 వేలకే లభిస్తుంది అంటాడితను. తాను 2015లో తయారు చేసి ఇచ్చిన ఎలక్ట్రానిక్ మెకానికల్ జాకార్డ్ పరికరాలు ఇప్పటి వరకు కూడా నిరంతరాయంగా, ఎలాంటి వైఫల్యాలు లేకుండా పని చేస్తున్నాయి అని గర్వంగా చెప్పుకుంటాడు శివకుమార్.

పాత జాకార్డ్ పద్ధతిలో ఒక చీరకు చేయాల్సిన డిజైన్‌ను బట్టి పంచ్ కార్డ్‌లు తయారు చేయటానికి 25 నుంచి 30 వేల రూపాయల పంచ్ కార్డ్ తయారీ ఖర్చవుతుంది. చీరపైనే వచ్చే డిజైన్‌ను బట్టి ఇంకా పెరుగుతుంది ఈ ఖర్చు. ఇంత ఖర్చు చేసి డిజైన్ తయారు చేయించిన తర్వాత ఆ చీర మార్కెట్లో ఫెయిల్ అయితే ఈ ఖర్చంతా నష్టమే. ఆ కార్మికుడు మళ్ళీ అప్పు చేసి మరో డిజైన్ తయారు చేయించుకోవాల్సి వుంటుంది. ఇలా అప్పుల పాలైనవారు చాలామంది వున్నారు. పైగా ఈ పంచ్ కార్డ్‌లను తయారు చేయటానికి కనీసం 6 నెలల సమయం పడుతుంది. ఇక్కడ మరో విషయం గమనించాలి. ఒక డిజైన్‌కు తయారు చేసిన పంచ్ కార్డులు మూడు నాలుగు సంవత్సరాలకన్నా ఎక్కువగా నిలువ వుండవు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఇవి పాడైపోతాయి. ఎందుకంటే అవి అట్ట ముక్కలు కాబట్టి చలి, వర్షా కాలాల్లో అవి ఉబ్బిపోయి పాడైపోతాయి. బాగా ప్రాచుర్యం పొందిన చీరల డిజైన్ల పంచ్ కార్డ్‌లను మళ్ళీ మళ్ళీ తయారు చేయించుకోవాల్సి వుంటుంది. అందువల్ల కొత్త కొత్త డిజైన్లతో ప్రయోగాలు చేసే అవకాశాలు కూడా చాలా తక్కువ. శివకుమార్ తయారు చేసిన ఈ ఎలక్ట్రానిక్ జాకార్డ్ పద్ధతి ద్వారా ఈ ఖర్చంతా ఏమీ వుండదు.




శివకుమార్ యంత్రం సహాయంతో జాకార్డ్ ముక్కలు అవసరం లేకుండా చీరపై నేయబడ్డ అతని తల్లిదండ్రుల చిత్రాలు

ఎన్ని లక్షల చీరకైనా సరే ఈ ఖర్చు 'సున్న' అంటాడు శివకుమార్. అంటే ఎటువంటి చీరకైనా సరే 'పంచ్‌కార్డ్' అనే ఖర్చే వుండదు. పాత పద్ధతిలో అయితే ఒక చీర ఎలా వుండాలి అన్నదాన్ని ఒక డిజైనర్‌చేత బొమ్మ గీయించి, ఆ తర్వాత దానికి తగ్గట్టుగా పంచ్‌కార్డ్ తయారు చేసుకోవాల్సి వుంటుంది. ఈ పద్ధతిలో డిజైనర్‌చేత బొమ్మ గీయించి, దాన్ని కంప్యూటర్ ద్వారా ఒక పెన్‌డ్రైవ్‌లో నిక్షిప్తం చేసి ఎలక్ట్రానిక్ జాకార్డ్‌కు అందిస్తే చాలు అనుకున్న చీర మొత్తం తయారైపోతుంది. ఇక ఎన్ని లక్షల చీరకైనా సరే డిజైనర్ ఛార్జి మాత్రమే వుంటుంది తప్ప పంచ్ కార్డులు తయారు చేయాల్సిన అవసరం లేదు. కొత్తరకం డిజైన్ ఏదైనా ఆలోచించి ఒక చీర నేసిన తర్వాత దానికి మార్కెట్లో తగిన గిరాకీ లేదనుకోండి వెంటనే మరో డిజైన్‌కు ఎలాంటి ఖర్చు లేకుండా వెళ్ళవచ్చు చేనేత కార్మికుడు.

శివకుమార్ ఇప్పటికి రెండు నమూనా యంత్రాలు (ప్రొటోటైప్) తయారు చేసి హైదరాబాద్‌లో ఒక సంవత్సరం పాటు పని చేయించి, తర్వాత చెన్నయ్‌లో ఎక్కువ చేనేతకారులున్న ప్రాంతంలో వీటిని గత ఆరు నెలలుగా పని చేయిస్తున్నాడు. 220 సంవత్సరాలుగా ఉపయోగిస్తున్న జాకార్డ్ యంత్రం ఎలా వుంటుందో, శివకుమార్ చేసిన జాకార్డ్ యంత్రం కూడా పైకి చూడటానికి అలాగే వుంటుంది. నేత కార్మికుడు కూడా దీనికొరకు ఎటువంటి కొత్త శిక్షణ తీసుకోవాల్సిన అవసరం లేకుండా వారి పద్ధతిలోనే తన సృజనను జోడించి తయారు చేసిన జాకార్డ్ యంత్రమిది అంటున్నాడు. ఎందుకంటే ఎన్నో యేళ్ళుగా సాంప్రదాయ జాకార్డ్ పద్ధతికి అలవాటు పడ్డ, ఏమాత్రం చదువులేని నేత కార్మికులకు కొత్త పద్ధతిలో నేత నేయించాలంటే ఎంతో ఇబ్బందికి గురై దాన్ని తిరస్కరిస్తారు. కాబట్టి వారి పద్ధతిలోనే వుండేలా దీని తయారీకి పూనుకున్నాడు. ప్రస్తుతమున్న జాకార్డ్ యంత్రం తొక్కడానికి కాస్త శక్తి అవసరమౌతుంది కాబట్టి వయసుమీరిన వారు ఈ పని చేయలేక మానేస్తున్నారు. కానీ, ఈ ఎలక్ట్రానిక్ జాకార్డ్ యంత్రాన్ని తొక్కడానికి ఎక్కువ శ్రమ అవసరం లేదు కాబట్టి వయసు మళ్ళిన చేనేత కార్మికులు కూడా సులువుగా పని చేసుకోవచ్చు. పని మానాల్సిన అవసరం లేదు.

కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం దేశంలో 24 లక్షల చేనేత మగ్గాలు వున్నాయని, అందులో జాకార్డ్ పద్ధతితో 4.5 లక్షల మగ్గాలు పని చేస్తున్నాయని అంటాడు శివకుమార్. వీటిలో 66% మగ్గాలు గ్రామీణ ప్రాంతాల్లోను, 34% మగ్గాలు పట్టణ ప్రాంతాల్లో వున్నాయని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ప్రతి మగ్గానికి 2 నుండి 4 జాకార్డ్ పరికరాలు ఉంటాయి. శివకుమార్ చేసిన మరో పని ఏమిటంటే, గ్రామీణ ప్రాంతాల్లో కరెంటు పోయినప్పుడు ఈ జాకార్డ్ పనిచేయటం ఆగకూడదని, మెకానికల్‌గా పనిచేసే మగ్గాలలో అమర్చే ఈ ఎలక్ట్రానిక్ జాకార్డ్ పరికరం పని చేయటానికి అనువుగా ఒక చిన్న బ్యాటరీని అమర్చాడు. కాబట్టి గ్రామీణ ప్రాంతల్లోని వారు కూడా కరెంటుతో పని



ఎలాంటి ఖర్చు లేకుండా చీరపై నేయబడ్డ వేంకటేశ్వర స్వామి ప్రతిమ

లేకుండా ఒక్కసారి రీఛార్జ్ చేసి పెడితే 2 రోజుల వరకు మగ్గం పనులను చేసుకోవచ్చు.

కేంద్ర చేనేత బోర్డు వారు కూడా ఈ పరికరాన్ని పరీక్షించి తమ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ పరికరంలో ఎలాంటి లోపాలు లేవని నిర్ధారించారు. ఇక ఇప్పుడు వీటిని పెద్దయెత్తున తయారు చేసి, చేనేత కార్మికులకు అందించేందుకు ఉద్యుక్తుడు అవుతున్నాడు శివకుమార్. వీటిని తయారు చేసేందుకు ఒకటిన్నర కోట్ల దాకా పెట్టుబడి అవసరమౌతుంది, ఈ పరికరం మొత్తం పేటెంటు కూడా చేయడం జరిగింది. ప్రతి నెల వెయ్యికి పైగా జాకార్డ్ యంత్రాలను తయారు చేయాలి అనుకుంటున్నాడు. దీని తయారీకి కొన్ని భాగాలు చైనాలో, కొన్ని కొరియాలో, మరికొన్ని సింగపూర్ లాంటి ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వుంటుంది. ఇటువంటి పరికరం భారతదేశంలో ఇప్పటి వరకు ఎక్కడా ఉపయోగంలో లేదని ఘంటాపథంగా చెబుతున్నాడు శివకుమార్.

జాకార్డ్ మగ్గాలు తెలంగాణలోని గద్వాల తదితర ప్రాంతాల్లో, ఆంధ్రప్రదేశ్‌లో ధర్మవరం, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, చీరాల ప్రాంతాల్లో మరియు తమిళనాడు, జార్ఖండ్, ఉత్తర ప్రదేశ్, బెంగాల్, ఒరిస్సా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో కూడా వున్నాయని అంటున్నాడు శివకుమార్.



కృతజ్ఞతతో చీరపై నేయబడ్డ మిత్రుల పేర్లు


చైనా నుంచి శివకుమార్‌కు సహకరించిన మిత్రుడి చిత్రం

2006 నుంచి ఇప్పటి వరకు తన తల్లి, చెల్లి, తమ్ముళ్ళను చూడనేలేదని, ఈమధ్యనే తన తమ్ముడి పెళ్ళికూడా అయిందని తెలుసుకున్నాడు. తన తమ్ముడు తనకోసం వెతకని ఊరు లేదని, వారికి తన పరికరం తయారై నేత కార్మికులకు అందుబాటులోకి వచ్చిన తర్వాత విజయగర్వంతోనే తన కుటుంబీకులను కలుసుకుంటాను అంటున్నాడు. కానీ వారు ఎక్కడ వున్నారు? ఎలా వున్నారు అన్న విషయాలన్నీ తెలుసుకుంటూనే వున్నానని, తన తమ్ముడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటూ తన తల్లి, చెల్లిని బాగా చూసుకుంటున్నాడని ఆనందం వ్యక్తం చేశాడు శివకుమార్. కానీ తాను లేని లోటు మాత్రం వారికున్నట్లు తెలుసుకుని బాధ పడుతున్నాడు. హైదరాబాద్ చేరుకున్న తర్వాత జయంతిని వివాహం చేసుకున్నానని, ఆమె కూడా తన ఈ యజ్ఞం విజయం కోసం పూర్తిగా సహకారం అందించిందని చెప్పాడు. ఏ స్త్రీ అయినా మాతృత్వాన్ని కోరుకుంటుంది కానీ, తమకు పిల్లలు పుడితే తన భర్త యజ్ఞానికి ఆటంకం వాటిల్లే అవకాశం వుందని, అది పూర్తయ్యే వరకు తమకు పిల్లలు వద్దని కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటిస్తుందంటే ఆమె సహనానికి, ప్రోత్సాహానికి జోహార్లు అర్పించాల్సిందే ఎవరైనా. శివకుమార్‌కు వివాహమై ఇప్పటికి 12 సంవత్సరాలైంది. ప్రస్తుతం శివకుమార్ వయస్సు 38 సంవత్సరాలు.

శివకుమార్ కథలో మరో ఆశ్చర్యం ఏమిటంటే 2006లో కేవలం 2 వేల రూపాయలతో కట్టు బట్టలతో హైదరాబాద్ చేరుకున్న తర్వాత తన యజ్ఞం



శివకుమార్ చేస్తున్న యజ్ఞం

ఫలించటానికి ఎన్నోవిధాల సహాయ సహకారాలు సౌభ్రాతృత్వ భావంతో అందుతునే వున్నాయి. ఎంతో పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలలో పనిచేసే నాలుగైదుమంది ఉద్యోగులు ఇతనికి ఫేస్‌బుక్, వాట్స్‌యాప్ గ్రూపుల ద్వారా పరిచయమై ఇతని స్ఫూర్తికి మెచ్చి తాము ఆర్థికంగా, సాంకేతికంగా సహకారం అందిస్తూనే వున్నారు. ఇందులో కొందరు విదేశాల్లో వున్నవారు కూడా వున్నారు. వాళ్ళు ఇతని నుండి ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా ఇంతగా సహకరిస్తున్నారు అంటే 'దైవేచ్ఛ' అనక తప్పదేమో. తమకు వచ్చే నెల జీతాల్లో ఇతనికి కొంత కేటాయించటం అంటే మాటలా?!!! హైదరాబాద్ లాంటి మహా నగరంలో బ్రతుకు బండి సాగించాలంటేనే ఎంతో కష్టపడాల్సి వుంటుంది. అలాంటిది ఇతని బ్రతుకుదెరువు, కల ఫలించేందుకు సహకరిస్తున్నారంటే వారిని అభినందించటం అనేది కూడా చిన్న మాటే అవుతుందేమో. ఈ పరికరం తయారు చేయటానికి ఇప్పటికే రూ. 50 లక్షలకు పైగా ఖర్చయిందని అంటున్నాడు శివకుమార్. చైనాలో వున్న జేసన్ స్మిత్ అనే ఒక ఇంజనీర్ (అతనెవరో కూడా తనకు తెలియదు) తాను చేస్తున్న పరిష్కారానికి ప్రభావితుడై ఇప్పటికే ఇందులో దాదాపు 25 లక్షల రూపాయల దాకా ఇవ్వటం జరిగింది. ఇతని జీవనానికి ఖర్చులు, పరికరం తయారీ ఖర్చులు, కొన్ని అవసరమైన సాంకేతిక సహకారాలు అందించటం .... ఊహిస్తేనే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. కేవలం పరికరం డిజైన్ చేయటం మాత్రమే తన పని అని, దానికొరకు తనకు అవసరమైన అన్ని సాంకేతిక సహకారాలు, సాఫ్ట్‌వేర్ వ్రాయటాలు అన్నీ వారే చేస్తున్నారు. ఈ పరికరాలన్నింటికి వారే పేటెంట్ అప్లయ్ చేసి సాధిస్తున్నారు. ఇంతమంది సహృదయంతో సాధించిన ఈ పరికరం తప్పక పునాది స్థాయి నేత కార్మికులకు త్వరలో చేరటానికి తగిన ఆర్థిక సహకారం అందుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు శివకుమార్.

కలకత్తాకు చెందిన ఒక పెట్టుబడి దారుడు శివకుమార్ ఎలక్ట్రానిక్ జాకార్డ్ పరికరాన్ని గురించి క్షుణ్ణంగా పరిశీలించి, వివిధచోట్ల దాని పనితనాన్ని దాదాపు 10 లక్షల రూపాయలు ఖర్చు చేసి సర్వే చేయించి, బాగుందని తెలుసుకున్న తర్వాత శివకుమార్‌తో ఈ పరికరం సాంకేతిక వివరాలు తనకు ఇస్తే నీకు ప్రతిఫలంగా 20 కోట్ల రూపాయలు ఇస్తానన్నాడు. దానికి ఇతను ఇది మిత్రుల సహకారంతో, తల్లిదండ్రుల బాధ, నా కష్టం మాత్రమే కాదు, లక్షలాది చేనేత కుటుంబాల బాగుకోసం చేసిన పరికరమని, దీన్ని అమ్ముకోవటం నాకిష్టం లేదని, దీన్ని ఎలాగైనా నేనే తయారు చేసి జాతికి అంకితం ఇస్తానని సున్నితంగా అతని ఆహ్వానాన్ని తిరస్కరించాడు. ఎందుకలా చేశావని ప్రశ్నిస్తే, పెట్టుబడిదారులు ఈ పరికరాన్ని నావద్ద కొని లక్షలాది రూపాయలకు విక్రయించుకుని సొమ్ము



'పద్మశ్రీ' చింతకింది మల్లేశం ద్వారా 'పల్లెసృజన'కు పరిచయమైన శివకుమార్

చేసుకుంటారని, ఆ సొమ్ము పెట్టుబడిగా పెట్టే శక్తి చేనేత కార్మికులకు లేదని, తానైతేనే ఈ పరికరాన్ని 50 వేల రూపాయలకే అందించగలనన్న విశ్వాసంతో ఉన్నాడు శివ కుమార్. తనకు డబ్బుకన్నా వ్యవస్థ బాగుపడటమే ఆనందం అంటాడితను. ఇది కేవలం చేనేత కార్మికులకు మాత్రమే సహాయం చేయటం కాదని, దీన్ని ఉపయోగించటం వల్ల చీరల ఖరీదు కూడా చాలా వరకు తగ్గుతుంది అంటాడు. ఈ యంత్రం పూర్తిగా ఉపయోగంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు లక్ష రూపాయల ఖరీదు చేసే చీర సగం ధరకే లభించే అవకాశం ఉంటుందని, తద్వారా యావత్ మహిళా (భర్తలకి) లోకానికి కూడా నేను ఖర్చు తగ్గించిన వాడినవుతానని గర్వంగా చెపుతున్నాడు శివకుమార్.

ఈ విషయం వింటుంటే 'భాగవతాన్ని ఆంధ్రీకరించిన పోతన' గుర్తుకు వస్తాడు. ఆయన వ్రాసిన భాగవతాన్ని తమకు అంకితమివ్వమని ఎందరో రాజులు వెంట పడగా, "పలికెడిది భాగవతమట, పలికించెడి విభుండు రామభద్రుండట" అంటూ ఆయన నాచేత వ్రాయించిన భాగవతాన్ని ఆయనకు తప్ప ఇతరులకు అంకితమివ్వను' అన్న కథనం మదిలో మెదులుతుంది.

ఈ పరికరాన్ని తయారు చేసే పని వెంటనే చేపడితే కేంద్ర ప్రభుత్వం ద్వారా సబ్సిడీపై చేనేత కార్మికులకు అందేలా తప్పకుండా ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. మేమే కాకుండా కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా 15 నుండి 40 శాతం వరకు సబ్సిడీ అందించే అవకాశాలున్నాయని వెరసి చేనేత కార్మికుడికి కేవలం 10 నుండి 25 శాతం విలువకే అందే ఏర్పాటు చేయటానికి వారి వంతు తప్పక కృషి చేస్తామన్నారట.

తాను అనుకున్న విధంగా ఈ పరికరం చేనేత కార్మికులకు చేరుకున్న తర్వాత నేను ఇద్దరికే క్షమాపణలు చెప్పుకోవాల్సి వుంటుందంటాడు శివకుమార్. అందులో మొదట నా తల్లికి– ఎందుకంటే ఇంటికి పెద్ద కొడుకును అయివుండి, కుటుంబాన్ని పట్టించుకోకుండా ఒక పరికరం రూపొందించేందుకు కుటుంబాన్ని వదిలిపెట్టి వస్తే తన తల్లి ఎంతో కష్టపడి తమ్ముడు, చెల్లెలును పోషించిందని. ఆ తర్వాత నేను క్షమాపణ చెప్పుకోవాల్సింది తన భార్య జయంతికి– తాను రాత్రింబవళ్ళు నిద్రాహారాలు మాని పని చేసుకుంటూ వుంటే తనకు ఏమాత్రం ఇబ్బంది కలిగించకుండా, అమ్మతనాన్ని కూడా త్యాగం చేసినందుకు ఆమెకు కూడా క్షమాపణలు చెప్పుకోవాల్సి వుంటుందని అంటున్నాడు. తాను ఈ యంత్రం తయారీలో పడిన తర్వాత నిద్రపోయేది రోజుకు రెండు లేదా మూడు గంటలు మాత్రమే. ఒక్కోసారి నిద్రలో కూడా ఆలోచన వస్తే వెంటనే లేచి పనిమీద పడిపోతుంటాను, ఒక్కోసారి ఆలోచనలతో తల పట్టుకుని కూర్చుంటే, నన్ను చూసిన ఆమె ఒక్కోసారి ఎందుకిలా చేస్తున్నాడు, ఏమైపోతాడో అని భయపడిపోతుండేదట.

పరికరం పూర్తయిన తర్వాత వెంకటేశ్వర స్వామి బొమ్మను చీరపై వచ్చేలా డిజైన్ చేసి చీర నేయించి ఆయనకు మొక్కు తీర్చుకున్నాడు. అలా ఆ చీరపైన వెంకటేశ్వర స్వామి బొమ్మ వచ్చేలా పంచ్‌కార్డ్ తయారు చేయాలంటే కనీసం రూ. 70 వేలు ఖర్చవుతుంది. అటువంటిది ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వెంకటేశ్వర స్వామి ప్రతిమ చీరపై వచ్చింది. ఆ తర్వాత అమ్మా నాన్న బొమ్మ వేశాను ఆ తర్వాత తనకు సహకరించిన మిత్రుల బొమ్మలు వేశాను. వీటన్నిటికి పంచ్ కార్డులు తయారు చేయాలంటే మూడు నుంచి నాలుగు లక్షల దాకా ఖర్చయ్యేది.

తాను ఎన్నో సంవత్సరాలు శ్రమించి, సాధించిన యజ్ఞ ఫలాన్ని ఏదోవొక పెట్టుబడిదారుని చేతిలో పెట్టి, చేనేత కార్మికులు ఆ యంత్రం కొనేందుకు అష్ట కష్టాలు పడి అడిగినంత చెల్లించి, అతన్ని కోటీశ్వరుడ్ని చేసేకన్నా, తానే ఏదోవిధంగా కొంత మూలధనం సంపాదించి, ఆ పరికరం తయారీకి పూనుకుని అందుబాటు ధరలో చేనేత కార్మికులకు అందజేసి ఫలితం మొత్తం చేనేత వర్గానికి చెందేలా చేయాలన్నది నాకు మిగిలిన కోరిక అంటాడు శివకుమార్.

ఈ పరికరం ఉపయోగంలోకి వస్తే దేశంలో లక్షలాది చేనేత కుటుంబాల స్థితిగతులనే మార్చే శక్తి దీనికుందని భావిస్తోంది 'పల్లెసృజన'. దీనికై శివకుమార్‌ను సంబంధిత అధికారులకు పరిచయం చేసి, అతని కోరిక తీరే దిశలో 'పల్లెసృజన' అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఈ పరికరం మార్కెట్లోకి రావటానికి తగిన ఆర్థిక సహాయం చేయాలనుకున్న వారెవరైనా 'పల్లెసృజన' ద్వారా శివకుమార్‌ను సంప్రదించవచ్చు. ●

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

National Innovation Foundation-India



ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

# జాతీయ 11 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 11వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ** రెండవ **బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును.** జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును. అంతే కాదు ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. 10,000లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2019** లోగా మాకు చేరేలా పంపండి.

SRISTI HONEY BEE NETWORK GIAN

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 261131/32/ 38/ 39, Fax: (079) 26731903, Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై http://www.nif.org.in/announcement సంప్రదించండి. లేదా 'పల్లెసృజన' కార్యాలయాన్ని (ఫోన్ : **040–27111959**) సంప్రదించండి.



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్




## వ్యవసాయ వ్యర్థాలను ఎరువుగా మార్చే యంత్రం

**సమస్య – పరిష్కారం :**

సేంద్రియ వ్యవసాయ విధానంలో 'కంపోస్టు' ఎరువుకున్న ప్రాధాన్యత మరి దేనికీ లేదు. వ్యవసాయ వ్యర్థాలు, ఇళ్ళలోని చెత్తతో కంపోస్టు చేసుకోవచ్చు అని అందరికీ తెలుసు. కాకపోతే దానికి సాధారణంగా 3–4 నెలల సమయం పడుతుంది. ఈ కాల పరిమితిని తగ్గించే యంత్రాలు విదేశాల్లో మాత్రమే లభించేవి. కానీ 'ఉర్మెల్ సింగ్ ధోన్సీ' అనే రాజస్థాన్‌కు చెందిన ఇన్నోవేటర్ ఈ ప్రక్రియని కేవలం 25

నుండి 40 రోజుల లోపలే చేసే పరికరాన్ని కనుగొన్నాడు. అతను చెప్పినదాని ప్రకారం ఈ యంత్రం ద్వారా కంపోస్టు తయారు చేయటానికి టన్నుకు కేవలం 2 రూపాయలు ఖర్చవుతుంది.

**పరికరం :**

చెత్తను తిరగవేయటం యంత్రం సహాయంతో జరుగుతుంది. ఈ యంత్రాన్ని ట్రాక్టర్‌కు అనుసంధానం చేసుకోవచ్చు. యంత్రంలో భాగంగా ఒక రోటర్ షాఫ్ట్‌కు కొన్ని బ్లేడ్లు అమర్చబడి వుండి ఆ బ్లేడ్లు తిరుగుతూ చెత్తను తునకలు చేస్తూ, తడి కూడా అందజేస్తాయి. ఎండాకాలంలో 5 రోజులకోసారి, చలి కాలంలో 7 రోజులకోసారి చొప్పున 5–6 సార్లు చెత్త కుప్పపైకి ఈ యంత్రాన్ని తోలుకుంటూ వెళ్ళితే చాలు అదే చెత్తను కలిపి నీరు అందించటం వల్ల ఆ చెత్త కంపోస్టుగా తయారవుతుంది.

**సాంకేతిక వివరాలు :**

❀ 400 టన్నుల చెత్తను ఒక గంటలో కలియ గలుపుతుంది.

❀ గంటకు మూడున్నర నుంచి 4 లీటర్ల డీజిల్ ఖర్చవుతుంది.

❀ 50 హెచ్‌పి ట్రాక్టర్‌కు దీన్ని అనుసంధానం చెయ్యవచ్చు.

❀ రోటర్ 16 అంగుళాల వ్యాసం, 9 అడుగుల పొడవు కలిగి వుండి, 9 బ్లేడ్లు అమర్చబడి వుంటాయి.

❀ క్రోమ్ స్టీల్‌తో తయారు చేయబడిన ప్రత్యేకమైన గేర్‌బాక్స్

❀ రోటర్‌ను క్రిందకు, పైకి కదపటానికి అనువుగా హైడ్రాలిక్ సదుపాయం కలదు.





❀ 2000 లీటర్ల సామర్థ్యమున్న నీటి ట్యాంకు అమర్చబడి వుంటుంది.

**ముఖ్యాంశాలు :**

❀ ఈ యంత్రం సహాయంతో 120 నుండి 150 రోజుల్లో తయారయ్యే కంపోస్టు 25–40 రోజుల్లోనే తయారు చేయవచ్చు.

❀ పేడ కంపోస్టుకన్నా ఈ కంపోస్టులో పోషక విలువలు ఎక్కువ.

❀ ఈ పనంతా ఒకేవ్యక్తి చేసుకోవచ్చు.

❀ నిరుద్యోగులకు, ఎక్కువ కంపోస్టు అవసరమైన వారికి ఇది ఎంతో అనువైన యంత్రం.

❀ నలుగురు నిరుద్యోగులు ఈ యంత్రాలను పట్టణాల్లో ఏర్పాటు చేసుకుంటే వారికి ఉపాధి, రైతులకు తక్కువ ధరలో సేంద్రియ ఎరువు అందించటంతో పాటు, పట్టణాలను చెత్త దుర్గంధం నుండి కాపాడి ఆరోగ్యకరమైన వాతావరణం అందించవచ్చు.

**పురస్కారాలు :**

❀ ఇన్నోవేటర్ 'గుర్మిల్‌సింగ్ ధోన్సీ' కి ఎన్ఐఎఫ్ వారి 'ఉత్తమ సాంప్రదాయ జ్ఞానం' బహుమతిని 2012లో రాష్ట్రపతి అందజేశారు.

**వివరాలకు సంప్రదించండి :**

**ఇన్నోవేటర్: ఆర్.జె. ధోన్సీ, ఫోన్: 9414631570**

**పల్లెసృజన, సుభాష్, ఫోన్: 9652801700**

**Email: subhash4@gmail.com,**
**Phone: +91 79 26732456/ 2095, Fax : +91 79 26731903**
**Email: bd@nifindia.org, web : www.nif.org.in**

# పాలు పితికే యంత్రం



- 'ఎన్.ఐ.ఎఫ్. వారి రెడీ టు సేల్' సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జె. శశిమోహన్

**సమస్య – పరిష్కారం :**

డెయిరీ ఫారంలు, ఎక్కువ పాడిపశువులు వున్న వారికి పశువులనుండి పాలు పితకడం ప్రధాన సమస్య. నేర్పరులైన కూలీలు లభించటం కూడా దుర్లభంగా మారుతోంది. పైగా చేత్తో పితకడం అన్నది ఆరోగ్యకరమైన పద్ధతి కాదు అన్న భావన ప్రబలుతోంది. పాలు పితకటానికి యంత్రాలున్నా, చాలా ఎక్కువ పెట్టుబడి కావాల్సి వస్తోంది. ఈ సమస్యకి పరిష్కారంగా కర్నాటకకు చెందిన 'రాఘవ గౌడ' తక్కువ ఖరీదులో పాలు పితికే యంత్రాన్ని తయారు చేశాడు.

**పరికరం :**

ఇది చేతితో నడిపే విధంగా, యంత్ర సహాయంతో పని చేసే విధంగా రెండు రకాలుగా తయారు చేశాడు. తక్కువ పాడి పశువులున్న వారు కూడా దీనిని కొనుగోలు చేసి ఉపయోగించుకోవచ్చు. దీన్ని ఉపయోగించటం చాలా సులభం. స్త్రీలు కూడా సులభంగా ఉపయోగించుకోవచ్చు.

**సాంకేతిక వివరాలు :**

❀ ఈ యంత్రం తయారీలో మేలురకపు స్టీలు ఉపయోగించ బడినది.

❀ 18 కిలోల బరువున్న చేతితో నడిపే ఈ యంత్రం సహాయంతో ఒకసారి, ఒక పశువు నుండి పాలు పితకవచ్చు.

❀ సెమీ ఆటోమేటిక్‌లో కరెంటు లేదా బ్యాటరీతో పని చేసే యంత్రాలు కూడా అందుబాటులో వున్నాయి.



**ముఖ్యాంశాలు :**

❀ ఒక పశువుకు పాలు పితకటానికి కేవలం 4 నుండి 6 నిమిషాలు పడుతుంది.

❀ నిమిషానికి ఒకటిన్నర నుండి 2 లీటర్ల పాలు పితక వచ్చు.

❀ చేత్తో పాలు పితకడం వుండదు కనుక పూర్తిగా ఆరోగ్య ప్రదాయమైనది.

❀ పశువుకు ఎటువంటి హాని కాని, అసౌకర్యం కాని కలగదు.

❀ ఎటువంటి ఖర్చు లేకుండా 8 నుండి 10 సంవత్సరాల వరకు పని చేస్తుంది.






**పురస్కారాలు :**

❀ 2005లో ఇన్నోవేటర్ రాఘవ గౌడకు ఈ యంత్రం కనిపెట్టినందుకు గాను ఎన్ఐఎఫ్ వారు నాటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతులమీదుగా పురస్కారం అందించడ మైనది.

**వివరాలకు సంప్రదించండి :**

**ఇన్నోవేటర్ : రాఘవ గౌడ, ఫోన్ : 94481 44098, 94487 25520, పల్లెసృజన, సుభాష్, ఫోన్ : 9652801700**

E mail: subhash4@gmail.com,
Phone: +91 79 26732456/ 2095, Fax : +91 79 26731903
E mail: bd@nifindia.org, web : www.nif.org.in

## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.


సోలార్ సెల్ ఛార్జర్


వివిధ రకాల శుభ్రపరిచే సేంద్రియ ద్రావణాలు


శ్రీతైలం


సోలార్ స్ప్రేయర్


కరెంటు స్తంభాలనెక్కే చెప్పులు

హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.
ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :

77, రోడ్ నెం. 3, వాయుపురి,
సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959,
సెల్ : 96528 01700.

# 2019 జనవరి లో పల్లెసృజన పాల్గొన్న వివిధ ప్రదర్శనలు



భారత ప్రభుత్వం నుంచి 04 జనవరి, 2019న కొత్త ఢిల్లీలో 'జాతీయ ఎంటర్ ప్రెన్యూర్ 2018' (రూ. 1-10 లక్షల విభాగం) పురస్కారాన్ని మన ఇన్నోవేటర్ మహిపాల్ చారి అందుకున్నప్పటి చిత్రం.









జనవరిలో విజయవాడ పి.డబ్ల్యు.డి. గ్రౌండ్‌లో నిర్వహించిన అగ్రికల్చర్ & రోజ్ షో ప్రదర్శనలో 'పల్లెసృజన' పాల్గొన్న దృశ్యాలు













'స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల' హైదరాబాద్ లో 22 జనవరి, 2019న ఏర్పాటు చేసిన ఇన్నోవేషన్ ఎక్స్‌పో ప్రదర్శనలో 'పల్లెసృజన' పాల్గొన్నప్పటి దృశ్యాలు

ఈ ప్రదర్శనలో నలుగురు ఇన్నోవేటర్లు, నలుగురు వాలంటీర్లు, సుమారు 25 ఇన్నోవేషన్లను ప్రదర్శించడం జరిగింది. ఈ సందర్భంగా పల్లెసృజన వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారు ముఖ్య అతిథిగా హాజరై, కాలేజి యాజమాన్యంతో, శాఖాధిపతులతో, కళాశాల విద్యార్థులతో చర్చలలో పాల్గొన్నారు. సుమారు వెయ్యి మంది విద్యార్థులు ఉత్సాహంగా ఇన్నోవేషన్లను తిలకించి, వాలంటీర్లతో, ఇన్నోవేటర్లతో చాలా ఉత్సాహంగా మాట్లాడి అనేక విషయాలు తెలుసుకున్నాము అన్నారు.









జనవరి 24-26 వరకు ఎస్ఎస్‌సి కన్వెన్షన్ హాల్, లబ్బీపేట, విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, 24/7 న్యూస్ ఛానల్ వారు సంయుక్తంగా నిర్వహించిన 'రైతు రథం' ప్రదర్శనలో 'పల్లెసృజన' పాల్గొన్నప్పటి దృశ్యాలు.

మూడు రోజులపాటు జరిగిన ఈ ప్రదర్శనలో 'పల్లెసృజన' తరుపున ఇద్దరు ఇన్నోవేటర్లు, ఇద్దరు వాలంటీర్లు పాల్గొని పది ఇన్నోవేషన్లను ప్రదర్శించడం జరిగింది. సుమారు 200 మంది రైతులు, వెయ్యికి పైగా విద్యార్థులు 'పల్లెసృజన' స్టాల్స్ తిలకించి, అక్కడ ప్రదర్శించిన పోస్టర్లు, వీడియోలు చూసి ఇన్నోవేషన్లను ప్రశంసించారు. విద్యార్థులలో కొందరు భవిష్యత్‌లో మహిపాల్ చారి, బాలయ్య, చంద్రశేఖర్‌లలా అనేక కొత్త ఇన్నోవేషన్లు చేయటానికి తగ్గ స్ఫూర్తి లభించింది అన్నారు.





హైదరాబాద్, ప్రగతి స్కూల్‌కు చెందిన 49 మంది 6వ తరగతి విద్యార్థులు 'పల్లెసృజన' కార్యాలయంలో గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను దర్శించినప్పటి చిత్రాలు.

# విల్లూరి శేషగిరి వంటపాత్రల వాషింగ్ మిషన్



- పల్లె వీరరాఘవ రెడ్డి

విశాఖ పట్నం జిల్లా అనకాపల్లి పట్టణానికి చెందిన విల్లూరి శేషగిరి ఐటిఐ (ఎలక్ట్రానిక్స్) 1993–95లో పూర్తి చేశాడు. ఐటిఐ చదివేటప్పుడే డైనమో నుండి శక్తి తీసి అదే శక్తితో మోటార్‌ని తిప్పి, అదే మోటార్‌తో డైనమో తిప్పి ఒక బల్బు వెలిగించాడు. చిన్నప్పటినుండి సాంకేతిక పరిజ్ఞానం పట్ల మక్కువ ఎక్కువ. ఎలక్ట్రానిక్స్‌లో కూడా కొద్దిగా పరిచయం వుంది. పదవ తరగతి చదివేటప్పుడే సినిమా ప్రొజెక్టర్‌ను తయారు చేశాడు. అప్పట్లో సినిమా రీళ్ళను అమ్మేవారు. ఆ రీళ్ళను కొని తన చిన్న వయసులోనే ఒక పెట్టెలో అమర్చి 40 క్యాండీల్ల బల్బు పెట్టి, చేతితో సమ వేగంతో తిప్పుతూ మూకి సినిమా చూసేలా తయారు చేశాడు.

అలాగే 1996లో తన ఇంట్లోని నీళ్ళ ట్యాంక్ నుండి నీరు వృధాగా పోతూవుంటే దాన్ని గురించి ఆలోచించి, 12 డి.సి. బ్యాటరీతో మోటార్ సైకిళ్ళలో వాడే బ్లింకింగ్ హారన్‌తో ట్యాంకు నిండిన వెంటనే శబ్దం వచ్చేలా పరికరాన్ని తయారు చేశాడు. అలా తన మిత్రులకి కూడా తక్కువ ఖర్చులో ఇలాంటి పరికరాలను తయారు చేసి ఇచ్చాడు. అవి ఇప్పటికీ నిరంతరాయంగా పని చేస్తూనే వున్నాయి. 1998లో వినాయక చవితికి మామూలుగా వేసే పందిర్లు కాకుండా పైపులు, నట్లు బోల్టులతోనే మిత్రుల సహాయంతో పందిరి వేసేవాడు. మరలా వినాయక చవితి అయిపోయిన వెంటనే వాటిని విప్పదీసేవారు.

2003లో వివాహం చేసుకున్న తర్వాత ఇంట్లో వంట పాత్రలు శుభ్రం చేయటం చాలా సమస్యగా వుందని, అతని భార్య పడుతున్న బాధను చూసి ఈ సమస్యకి ఏదైనా పరిష్కారం చూడాలని ఆలోచించి 2005లో ఒక నమూనా తయారు చేసుకున్నాడు. అందుకు పాత వాషింగ్ మిషన్ ఒకటి కావాలి. అప్పటినుంచి దానిపైన ఆలోచనలు చేస్తూ 2010లో ఆప్త మిత్రులతో తన ఆలోచన చెప్పాడు. ఒక మిత్రుడు వెంటనే తనవద్ద పనిచేసే వాషింగ్ మిషన్‌ను ఇచ్చి దీన్ని కావాల్సిన విధంగా మార్చుకుని వాడుకో నాకు తిరిగి ఇవ్వాల్సిన పనిలేదు అన్నాడు. దాంతో ముందుగా బ్రష్‌టైప్ మిషన్ డిజైన్ చేశాడు. దీనిలో స్టీల్ పాత్రలు ఒక్కటే శుభ్రమయ్యేవి. గాజు, పింగాణి పాత్రలు శుభ్రం అయ్యేవి కావు. మరలా ఆలోచించి, 2013లో



దానికి కొన్ని మార్పులు చేశాడు. అప్పుడు 60 శాతం వరకు ఆ యంత్రం పని చేస్తుందని తృప్తి పడ్డాడు.

ఆ తర్వాత విశాఖ పట్నంలోని తన స్టీలు సామాన్లు అమ్మే షాపు గల ఒక మిత్రుడిని కలిసి అతని సహకారంతో ఒక స్టీల్ బాడీని తయారు చేయించాడు. మిగతా లోపలి భాగాలను ఫ్యాబ్రికేషన్ పని చేసుకునే మరో మిత్రుడి సహకారంతో తన యంత్రానికి ఒక రూపు తీసుకు వచ్చాడు. దానిపై ఆరు నెలల పాటు ఉదయం 9 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు తీవ్రంగా కృషి చేశాడు. అంతా తయారైన తర్వాత దానికి అమర్చిన మోటారుతో సమస్య వచ్చింది. అందులో ఎక్కువ వంట పాత్రలు వేస్తే లోడు భరించలేక తక్కువ వేగంతో తిరిగేది. ఈ సమస్య పరిష్కారం కోసం ఎంతోమంది సాంకేతిక నిపుణులను కలిశాడు. వారు కూడా ఇతని సమస్యను పరిష్కరించలేక పోయారు. ఈ సమయంలో తన మిత్రుడొకతను బట్టల వాషింగ్ మిషన్‌లో బిగించిన మోటార్‌ను వేసి చూడమని సలహా ఇచ్చాడు. వెంటనే తనకు తెలిసిన వాషింగ్ మిషన్ మెకానిక్ వద్దకు వెళ్ళి బాగా పనిచేసే ఒక మోటార్‌ను తెచ్చుకున్నాడు.

దాన్ని తీసుకువెళ్ళి తన యంత్రంలోని మోటారు స్థానంలో దీన్ని అమర్చాడు శేషగిరి. గతంలో కంటే కొద్దిగా మేలనిపించింది. కానీ ఈ మోటార్‌లో కూడా చిన్న సమస్య వచ్చింది. ఆ మోటార్ కూడా విపరీతంగా వేడెక్కి యంత్రం ఆగిపోయేది. మళ్ళీ పదిహేను నిమిషాల్లో చల్లబడిన తర్వాత తిరిగి ఆడేది. అలా ఈ మోటార్ సమస్య ఇతన్ని బాగా నిరుత్సాహపరిచింది. ఏమి చెయ్యాలో, ఎలా చెయ్యాలో అర్థమయ్యేది కాదు, నిద్ర పట్టేది కాదు. ఎక్కడో సాంకేతికంగా ఒక సూత్రం తప్పుతోందని గ్రహించాడు. ఈ సమస్యను ఎవరితో పంచుకోవాలో అర్థమయ్యేది కాదు.

ఒకరోజు తనకు అద్భుతమైన ఆలోచన వచ్చి దాన్ని వెంటనే అమలు చేశాడు శేషగిరి. ఈ సమస్యకు పరిష్కారంగా యంత్రంలోని ఒక పుల్లీని చిన్నదిగా కాకుండా పెద్దది పెట్టి, దానికి తగిన బెల్టు పెట్టి ప్రయత్నించాడు. తాను అనుకున్న వేగం యంత్రంలో వచ్చింది. ఈ యంత్రానికి 1 హార్స్‌పవర్ లేదా 0.5 హార్స్‌పవర్ మోటార్లు వేస్తే ఖరీదు పెరిగిపోతుంది కాబట్టి ఇది సరియైన పరిష్కారం కాదు పైగా విద్యుత్తు ఖర్చు కూడా పెరిగిపోతుంది. ఈ యంత్రాన్ని సమాజానికి తక్కువ ఖరీదుకే అందించాలన్నదే అతని తపన.

ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పోషణ లాంటి సమస్యలతో ఈ యంత్రం తయారీ అనుకున్న స్థాయిలో జరగటం లేదు. అప్పటికే తనకి ఒక బాబు, ఒక పాప. అదృష్టం కొద్దీ తనకు వున్న మిత్రులు కూడా సాంకేతిక పరంగా తెలివైన





వారు, ఫ్యాబ్రికేషన్, లేత్ మిషన్‌లు, ఎలక్ట్రానిక్స్, స్టీల్ వర్క్‌లు, వాషింగ్ మిషన్ మెకానిక్‌లు, ముఖ్యంగా కుటుంబ సభ్యులు ఎంతగానో ప్రోత్సహించారు అంటాడు శేషగిరి.

ఈ యంత్రాన్ని పేటెంట్ చేయిస్తే బావుంటుందని అనుకున్న సమయంలో 2016లో వారి బంధువు ఒకరు ఎన్ఐఎఫ్ గురించి చెప్పారు. అప్పుడే ఎన్ఐఎఫ్ వారు 10వ జాతీయ ద్వైవార్షిక పోటీల గురించి పేపర్‌లో ప్రకటన ఇచ్చారు. తాను వెంటనే తన బంధువు సహాయంతో ఆన్‌లైన్‌లో అప్లికేషన్ పంపించారు. 2017లో ఎన్ఐఎఫ్ వారినుంచి ఫోన్ వచ్చింది. వారికి తన సమస్యను వివరించి, దీనికి పరిష్కారం తెలుపమని సలహా అడుగగా వారు తెలుగు మాట్లాడటం తెలిసిన 'వినోద్' గారికి ఫోన్ ఇచ్చారు. అతనికి తన యంత్రం గురించిన ఫోటోలు, వీడియోలు, పేటెంట్ వివరాలను పంపాడు. కొద్ది రోజుల్లోనే ఎన్ఐఎఫ్ వారు దీని తయారీకి అవసరమైన డబ్బును తన అకౌంట్‌లో జమ చేశారు. ఆ డబ్బుతో ఒక కొత్త డిష్ వాషింగ్ యంత్రాన్ని ఎంతో స్లిమ్‌గా, అధునాతనంగా వుండేలా డిజైన్ చేసి తయారు చేయించాడు.

ఆగస్టు 25, 2018 నాడు పల్లెసృజన వాలంటీర్ అంజిరెడ్డి ఫోన్ చేసి 'పల్లెసృజన' గురించి చెప్పి, ఆ యంత్రాన్ని చూసి చాలా బాగుంది అని బ్రిగేడియర్ గణేశం గారితో మాట్లాడించారు. ఆ తర్వాత ఆగష్టు 28వ తేదీన ఎన్ఐఎఫ్ టీం అతని ఇంటికి వెళ్ళి అతను తయారు చేసిన యంత్రాన్ని చూసి చాలా మెచ్చుకున్నారు.

ఈ పాత్రలు తోమే యంత్రం పూర్తిగా ఆటోమేటిక్. 25 పాత్రలు శుభ్రం చేయటానికి 45 నిమిషాల సమయం తీసుకుంటుంది. థర్మోసీల్ టెక్నాలజీతో తయారైంది. స్టీలు, గాజు, పింగాణి పాత్రలను కూడా శుభ్రం చేస్తుంది. నెలకు కేవలం రూ. 150 ల నిర్వహణా ఖర్చు వుంటుంది. పూర్తిగా స్టీలుతో తయారైంది కాబట్టి గీతలు పడవు. పాత్రలు ఆరిన తర్వాత 2 గంటల వరకు వేడిగా వుంటాయి కాబట్టి బ్యాక్టీరియా, బొద్దింకలు, బల్లులు, ఎటువంటి కీటకాలు పాత్రలపై చేరవు.

శేషగిరి తనవద్ద ఇదే కాక మరో 6 రకాల ఇన్నోవేషన్ ఐడియాలు వున్నాయని అంటున్నాడు. పల్లెసృజన శేషగిరికి అన్ని రకాల సహాయం అందించటానికి సిద్ధంగా వుంది. ఎన్ఐఎఫ్‌తో మరింత సంధానం, అవార్డుకై ప్రయత్నించడం, పేటెంటుకై అప్లై చేయటం, మార్కెటింగ్ అవకాశాలు ఇవన్నీ పల్లెసృజన శేషగిరి సృజనాత్మక శక్తికి తోడుగా వుంటూ ఆయన ఇన్నోవేషన్ 'వంటపాత్రల వాషింగ్ మిషన్'ను వెలుగులోకి తీసుకు రావటానికి శాయశక్తులా కృషి చేస్తుంది. ●

**ఇన్నోవేటర్ శేషగిరి ఫోన్ నెం. 9030427218**


## విజయవాడలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం







దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని ఉపయోగకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.

విజయవాడ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.

ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

'పల్లెసృజన' ఇన్నోవేషన్ల విస్తృతి కేంద్రం చిరునామా :

40-5-6/2, ప్రగతి ఆఫ్‌సెట్ ప్రింటర్స్ ప్రై.లి. ప్రాంగణం,

టికిల్ రోడ్, బృందావన్ కాలనీ, విజయవాడ - 520007.

సెల్ : 8919903118

# 9వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో బహుమతి పొందిన ఇన్నోవేషన్లు




- 'ఎన్.ఐ.ఎఫ్. సౌజన్యంతో...

స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## అభివృద్ధి చేసిన ట్రాక్టర్ డోజర్ బ్లేడ్

**జాతీయ మూడవ బహుమతి – మెకానికల్ విభాగం**

**ఇన్నోవేటర్ : మదన్‌లాల్ కుమావత్, సీకర్ జిల్లా, రాజస్థాన్.**



రాజస్థాన్ రాష్ట్రంలోని శీకర్ జిల్లాకు చెందిన 52 సంవత్సరాల మదన్‌లాల్ కుమావత్ స్వంతంగా వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను తయారు చేసి, రిపేరు చేసే వర్క్‌షాప్ నడుపుతూ వుంటాడు. ఇతను ట్రాక్టరుకు అనుసంధానం చేసే కొత్తరకం 'డోజర్'కు రూపకల్పన చేశాడు. దీనివలన రిపేర్లు చేయటం కానీ, రవాణా కానీ, పని చేయటంలో కానీ ఎంతో సౌలభ్యం ఏర్పడింది.

వడ్రంగి అయిన ఇతని తండ్రి ఇతర పెద్ద వడ్రంగి వద్ద రోజువారి వేతనంతో పనిచేస్తూ జీవనం గడిపేవాడు. మదన్‌లాల్ పది సంవత్సరాల వయసు వచ్చేంత వరకు ఇంట్లోనే చదువుకొని, తర్వాత గ్రామంలో వుండే పాఠశాలలో చేరాడు. చదువులో చురుకుగానే వున్న ఇతను ఒక పెద్ద ప్రమాదం బారిన పడి శారీరకంగా చాలా బలహీనమైపోయిన కారణంగా చదువును రెండవ తరగతితోనే ఆపివేయ వలసి వచ్చింది. దర్జీ పనితో పాటు తండ్రివద్ద వడ్రంగి పని కూడా నేర్చుకోవటం మొదలు పెట్టాడు. శారీరకంగా కొంత శక్తి వచ్చిన తర్వాత పూర్తి వడ్రంగిగా పని చేస్తూ కొన్నాళ్ళు గడిపాడు.

క్రమేణా మదన్‌లాల్‌కి ఇనుప వస్తువుల ఇంజనీరింగ్ చేయాలన్న ఆసక్తి కలిగి, ఆ వృత్తిలో తగిన కౌశల్యం సంపాదించటం కొరకు సమీపంలోని గ్రామంలోని ఒక వర్క్‌షాప్‌లో చేరాడు. తొమ్మిది సంవత్సరాల సుదీర్ఘ కాలం అక్కడ పనిచేసి, వ్యవసాయ యంత్రాలు, పనిముట్ల తయారీ, రిపేర్లకు సంబంధించిన అనేక మెళకువలను నేర్చుకున్నాడు. 1997లో 'దంతా' గ్రామంలో స్వంతంగా ఒక వర్క్‌షాప్‌ను ప్రారంభించి, అందులో వ్యవసాయ, గృహ నిర్మాణ యంత్రాలు రిపేర్లు చేస్తూ తరచూ వినియోగదారుల అవసరానికి తగ్గట్లు వాటిలో మార్పులు చేయటం కూడా నేర్చుకున్నాడు. పనిలో ఇతనికి తమ్ముడు సహాయం చేసేవాడు. ఇతనికి భార్య, నలుగురు పిల్లలు. పనిలో ఎంత నిమగ్నమైపోయేవాడు అంటే,



నిద్రకూడా మర్చిపోయి, రోజుకి 15 నుంచి 18 గంటలు ఏకబిగిన పనిచేసేవాడు. మొదట్లో భార్య విసుక్కున్నా, ఇతనికి పేరు ప్రఖ్యాతులు రావటం గమనించి, సర్దుకుపోయింది.

**అన్ని పంటలకు పనికి వచ్చే నూర్పిడి యంత్రం :**

పందొమ్మిది వందల ఎనభై లగాయతు 90వ దశకం మొదటి సంవత్సరాల వరకు రాజస్థాన్‌లో వ్యవసాయ పనిముట్లు అమ్మే డీలర్లు పంజాబ్ నుండి యంత్రాలు తెచ్చి, రాజస్థాన్‌లో అమ్మేవారు. రాజస్థాన్‌లో వుండే స్థానిక వర్క్‌షాపులలో వాటికి అవసరమైనప్పుడు కేవలం మరమ్మత్తులు మాత్రమే చేసేవారు. ఆ సమయంలో మదన్‌లాల్‌కు అనిపించింది. తానే ఒక నూర్పిడి యంత్రం ఎందుకు తయారు చేయకూడదు అని. సుమారు ఒక నెల రోజులపాటు శ్రమపడి స్వంతంగా ఒక నూర్పిడి యంత్రాన్ని తయారు చేశాడు. దాని పనితీరు పంజాబ్ నుండి దిగుమతి చేసుకున్న నూర్పిడి యంత్రాలకన్నా బాగుంది అన్న ప్రచారం వచ్చింది. దాంతో దాన్ని ఇంకా అభివృద్ధి చేయాలని సంకల్పించుకున్నాడు. క్రమంగా దాన్ని అభివృద్ధి చేస్తూ 1991లో పంట కోత, నూర్పిడి, తూర్పార బట్టటం పనులు ఒకేసారి జరిగేలా తన యంత్రానికే మార్పులు చేశాడు. 1993లో బ్లోయర్ వేగాన్ని నియంత్రించే ఏర్పాటు చేసి, అనేక పంటలకు పనికి వచ్చేలా రూపాంతరం చేశాడు.

ఈ యంత్రాన్ని కూడా ఇంకా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశ్యంతో దానికే డ్రమ్ము సైజు, కంకులను నలిపే పద్ధతులలో మార్పులు చేసి పొలంలో కోత పరిమాణాన్ని కూడా పెంచి, తక్కువ సమయంలో ఎక్కువ పని చేసుకునేలా చేయటంలో మూల యంత్రంపై అధిక భారం కూడా పడకుండా చేశాడు. తర్వాత కూడా అనేక మార్పులు చేసి, ఒకటే యంత్రం వివిధ రకాల పంటలకు పనికి వచ్చేలా అనుసంధాన పరికరాలను మార్చటానికి కేవలం 15 నుండి 20 నిమిషాల సమయం పట్టేలా ఏర్పాటు చేశాడు. సాధారణంగా ఇతర యంత్రాలలో ఇటువంటి మార్పులు చేయటానికి రెండు నుండి మూడు గంటల సమయం పడుతుందట! ఈ యంత్రాలను ఇప్పటికే 150కి పైగా తయారు చేసి అమ్మకాలు జరిపాడు మదన్‌లాల్.

ఈ యంత్రానికే మదన్‌లాల్‌కు ఎన్ఐఎఫ్ వారు పురస్కారం కూడా ఇవ్వటమే కాక, పేటెంట్ పొందటానికి సహాయం చేసి, తన మైక్రో వెంచర్ ఇన్నోవేషన్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం చేసి, ఈ యంత్రాలను తయారు చేయటానికి తోడ్పడ్డారు. ఇదే ఇన్నోవేషన్‌కి రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం 2004వ సంవత్సరంలో రాష్ట్ర పురస్కారం అందిజేసింది. 2010వ సంవత్సరంలో 'ఫోర్బ్స్' పత్రిక 'గ్రామీణ భారతంలో ఏడుగురు ఉత్తమ ఇన్నోవేటర్లలో ఒకనిగా ఇతన్ని ఎంపిక చేసింది.

**ట్రాక్టర్ అనుసంధాన 'డోజర్' తయారీ :**

2013వ సంవత్సరంలో రాజస్థాన్‌లోని కోటాకు చెందిన ఒక వ్యవసాయదారుడు 90 వేల రూపాయల ఖర్చుతో తన ట్రాక్టర్‌కు ఒక డోజర్‌ను మదన్‌లాల్‌చేత ఏర్పాటు చేయించుకున్నాడు. ఆ కాలంలో 'బుల్ ఇండియా' కంపెనీ వారు అటువంటి డిజైన్ కలిగిన డోజర్‌నే ఒకటిన్నర లక్షలకు అమ్మేవారు.

ట్రాక్టర్‌కు ముందు ఏర్పాటు చేసిన డోజర్ బరువును సమతులనం చేయటానికి ట్రాక్టర్‌కు వెనకాల తగినంత బరువును ఏర్పాటు చేయవలసి వుంటుంది. హింజ్ సదుపాయం లేని కారణంగా ఆ బరువును శాశ్వతంగా బిగించాడు. బరువు సమతుల్యం లేని కారణంగా ట్రాక్టర్ ఛాసిస్ తరచూ విరిగిపోతూ వుండేది. ఈ ఛాసిస్ ట్రాక్టర్ ముందు చక్రాలకు ఇరువైపులా ఆధారం తీసుకుని బిగించి వుండటం వలన ట్రాక్టర్ నడపటంలో కష్టంగా వుండేది. డోజింగ్ పనులు జరుగుతున్నపుడు ట్రాక్టర్ క్లచ్ కూడా పని చేస్తూనే వుంటుంది కనుక త్వరగా చెడిపోయేది. క్లచ్ రిపేరు చేయవలసి వచ్చినపుడు డోజర్ పరికరం మొత్తం విప్పదీయాల్సి వచ్చేది. ఈ సమస్య మదన్‌లాల్ దృష్టికి వచ్చినపుడు దీనికి పరిష్కారం కనుక్కోవాలని నిశ్చయించి, కేవలం ఆరు మాసాల సమయంలోనే దాన్ని పరిష్కారం కనుగొన్నాడు.

తొలుత ఛేసిస్‌ను ఒకే యూనిట్‌గా వుంచి చూశాడు. కానీ, క్లచ్ రిపేరు చేయటంలో ఇబ్బంది రావటంతో ఛేసిస్‌ని రెండు భాగాలుగా చేసి, క్లచ్‌ను సులువుగా రిపేరు చేసే ఏర్పాటు చేశాడు. వెనక చక్రం మడ్‌గాడ్ బోల్టుల నుండి మూడు సపోర్ట్‌లు తీసుకుని ఈ పని సాధించాడు.


ఈ మార్పుల వలన తరచూ ఛేసిస్‌కి రిపేరు రావటం ఆగిపోవటమే కాక, ట్రాక్టరు నడపడంలో సులువు కూడా వచ్చింది. వెడల్పు తగ్గటంతో ఒకచోటునుండి మరో చోటుకు వెళ్ళటం కూడా సులువైంది. ఇప్పటికి (గత మూడున్నర సంవత్సరాలలో) 35 యూనిట్లకు పైగా తయారు చేసి, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలోని రైతులకు విక్రయించాడు మదన్‌లాల్.

రైతులకు తక్కువ ధరలో అతి ఉపయోగకరమైన, సులభతరమైన ఈ డోజర్‌ను తయారు చేసినందుకు గాను ఎన్ఐఎఫ్ వారు 2017 సంవత్సరంలో 9 జాతీయ ద్వైవార్షిక పోటీలలో జాతీయ స్థాయి మూడవ బహుమతి అందించి సత్కరించటం జరిగింది.

## ద్విచక్ర వాహనాలు పంచర్ అయిన వెంటనే 'సీల్' వేసే ప్రకృతిసిద్ధ ద్రావకం

**జాతీయ మూడవ బహుమతి – రవాణా విభాగం**

**ఇన్నోవేటర్ : కంటాలి పాండురంగారావు, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.**



తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా, నారాయణ్ ఖేడ్ మండలం, 'సుక్కలతీర్థ' గ్రామానికి చెందిన 35 సంవత్సరాల పాండు రంగారావు ద్విచక్ర వాహనాలు, ఆటోలు పంచర్ అయిన వెంటనే పంచర్ పూడుకొని పోయే ఒక ద్రావకాన్ని తయారు చేశాడు. ఈ ద్రావకం ప్రత్యేకత ఏమిటంటే ఇది పూర్తిగా ప్రకృతిసిద్ధమైనది. ఎన్నిసార్లు పంచరైనా పని చేస్తుంది. వేడి వేసవిలో, చల్లని చలికాలంలో కూడా అంతే సమర్థవంతంగా పని చేస్తుంది.

కేవలం పదో తరగతి వరకు చదివిన పాండురంగా రావు నిగూఢమైన సృజనాత్మక నైపుణ్యం కలవాడు. అందుకే స్వంతంగా ఒక మోటార్ సైకిల్ రిపేర్ వర్క్‌షాప్ పెట్టుకున్నాడు. ఇతనికి భార్య ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు.

2008వ సంవత్సరంలో ఒకనాటి రాత్రి కుటుంబం తో స్నేహితుని ఇంటికి వెళ్ళి తిరిగి వస్తుండగా ఇతని మోటార్ సైకిల్ పంచర్ అయింది. దగ్గరలో ఎక్కడా పంచర్ వేసే సదుపాయం కనిపించలేదు. ఆ రాత్రిపూట భార్యా పిల్లవానితో ఇంటికి చేరటానికి 12 కిలోమీటర్లు తాను మోటార్‌సైకిల్ తోసుకుంటూ రావాల్సి వచ్చింది. అప్పుడు అనిపించింది ఇతనికి, ప్రతి చోటా, ప్రత్యేకించి గ్రామాలలో జరిగే ఇటువంటి అసౌకర్యానికి శాశ్వత పరిష్కారం కనుగొనాలని. సాధారణంగా టైరుకి పంచర్ పడితే, దానంతట అదే పూడుకుపోయి రిపేరు అవటానికి ట్యూబులో కొన్ని రసాయనాలు కలిపిన ద్రావణాన్ని నింపినా, పంచర్ చేయటానికి వేడి ప్యాచ్ వేయాల్సి వచ్చేది.

పైగా చక్రం తిరుగుతున్నపుడు రసాయనాలు కల ద్రావకం ట్యూబు, టైరును కొరికివేసే ప్రమాదముండేది. దీంతో ప్రతి 8 12 నెలలకోసారి పంచర్ పడకపోయినా, ట్యూబు మార్చవలసి వచ్చేది. ఈ విషయం గ్రహించిన పాండు మార్కెట్లో లభించే వివిధ రకాల ద్రావకాలను పరిశీలించి, విశ్లేషించి 2012లో రసాయనాలు లేని ప్రకృతిసిద్ధమైన, ట్యూబుకు ఎటువంటి హాని కలిగించని ద్రావకాన్ని రూపొందించాడు.

పాండు తయారు చేసిన ఈ ప్రకృతిసిద్ధమైన పంచర్లను పూడ్చే ద్రావకం ట్యూబుకు ఎటువంటి హాని చేయక పోవటమే కాక, ఎటువంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా సమర్థవంతంగా పనిచేసే విధంగా తయారు చేశాడు.

ఇతను ఈ ద్రావకంలో మైకా పొడరు, రబ్బర్ పొడరు, జిగురు, నారింజ రంగును ఉపయోగిస్తాడు. ఈ ద్రావకాన్ని ట్యూబులో వత్తిడితో నింపటానికి ఒక యంత్రాన్ని కూడా ఇతనే రూపొందించుకున్నాడు. ఈ యంత్రం 250 మి.లీ. ద్రావకాన్ని పది సెకన్లలో ట్యూబులోకి నింపేసుస్తుంది.

ప్రస్తుతం ఈ ద్రావకం ద్విచక్ర వాహనాలు, ఆటోల టైర్లలో ఉపయోగిస్తున్నారు. కారు టైర్లలో కూడా వాడటానికి





ప్రయోగాలు జరుగుతున్నాయి. పాండు వేరువేరు ఋతువులలో ఈ ద్రావకం పని తీరును పరీక్షించాడు. సాధారణంగా ఎండా కాలం వేడికి ట్యూబులోని గాలి వ్యాకోచం చెంది, టైర్ పేలిపోవటం జరుగుతుంటుంది. కానీ, పాండు రూపొందించిన ద్రావకంలో మైకా ను ఉపయోగించాడు. మైకాకు వేడిని గ్రహించే గుణం వుండటం వలన ఎటువంటి వాతావరణ పరిస్థితులనైనా తట్టుకుని ఈ ద్రావకం సాధారణంగా వుండి, ట్యూబుకు ఎటువంటి హాని కలుగనీయదు.

పాండు స్థానికంగా 3 వేల ట్యూబులను ద్విచక్ర వాహనాలకి, 80 ట్యూబులు ఆటో రిక్షాల వారికి వారివారి వాహనాలపై పరీక్షించటానికి ఇచ్చి, ఇది విజయవంతంగా పని చేస్తుంది అని నిర్ధారణకు వచ్చిన తర్వాతనే ట్యూబుల తయారీ ప్రారంభించాడు. ఇప్పటి వరకు 50 వేలకు పైగా ట్యూబులను దేశంలోని వివిధ ప్రాంతాలలో విక్రయించాడు.


ఎన్ఐఎఫ్ ఇతని పేరున పేటెంటు కూడా చేయటం జరిగింది. 2017వ సంవత్సరం ఢిల్లీలోని రాష్ట్రపతి భవనంలో రాష్ట్రపతి చేతులమీదుగా 9వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో జాతీయ స్థాయి మూడవ బహుమతిని అందించటం జరిగింది.

## రూ. 800/-తో మీ గ్రామాన్ని ఇతర గ్రామాల జ్ఞానంతో సంధానం చెయ్యండి

ప్రతి గ్రామంలో ఎన్.ఆర్.వి. (నాన్ రెసిడెంట్ విలేజర్స్) ఉంటారు. ఉద్యోగ రీత్యా లేదా వ్యాపార రీత్యా తమ గ్రామానికి దూరంగా స్థిరపడిన వారు చాలామంది తమ గ్రామం పట్ల మక్కువ వున్నవారై వుంటారు. అటువంటి వారు తమ గ్రామం కోసం ఏదైనా ఒక మంచి పని చేయాలన్న తపన కలిగిన వారు కూడా వుంటారు. అటువంటి వారు కేవలం రూ. 800/-లతో 5 సంవత్సరాల పాటు తమ గ్రామానికి ఒక మంచి పుస్తకాన్ని అందిస్తే మీకు మంచి పేరు రావటం, సంతృప్తి కలగటంతో పాటు, మరుగున పడివున్న ఎన్నో ఇన్నోవేషన్లు వెలుగులోకి వస్తాయి, మరెన్నో ఇన్నోవేషన్లను గురించిన సమాచారం మీ గ్రామానికి చేరి, వారు వినియోగించుకునే సదుపాయం కలుగుతుంది.

గ్రామం నుండి వెలుపల జీవనం సాగిస్తున్న మీ మిత్రులకు ఈ విషయం తెలియజేయండి. వారు 'పల్లెసృజన' పత్రికకు చందా పంపి, ఈ పత్రిక వారి గ్రామాలకు వచ్చే ఏర్పాటు చేస్తారు. చందా వివరాలు ఈ పత్రిక చివరి కవర్ పేజీలో ఇవ్వటమైనది. వీలైనన్ని ఎక్కువ గ్రామాలకు పత్రిక వెళ్ళేందుకు సహకరించాల్సిందిగా కోరుతున్నాము.

మన తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 30 వేల గ్రామాలున్నాయి. ప్రతి గ్రామానికి ఒక ఎన్.ఆర్.వి. తప్పకుండా ఉంటాడు. ప్రతి గ్రామానికి పల్లెసృజన చేరాలంటే ఆయన తన గ్రామం కోసం చందా కట్టాలి. అందరం కలిసి పల్లెసృజనను అన్ని గ్రామాలకు చేరేట్టుగా చేద్దాం. -ఎడిటర్



## డా. ఎపిజె అబ్దుల్ కలాం

# ఇగ్నైట్

## పోటీలు 2019

"నేర్చుకోవటం వల్ల సృజనాత్మకత వస్తుంది
సృజనాత్మకత ఆలోచనలకి దారి తీస్తుంది
ఆలోచనలు జ్ఞానాన్నిస్తాయి
జ్ఞానం మిమ్మల్ని గొప్పవాళ్ళను చేస్తుంది"

**'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ - ఇండియా'** పాఠశాల విద్యార్థుల కొరకు వారి స్వంత సాంకేతిక ఆలోచనలు మరియు సృజనల జాతీయ స్థాయి పోటీలను నిర్వహిస్తున్నది.

**'డా. ఎపి.జె. అబ్దుల్ కలాం ఇగ్నైట్ పోటీలు-2019'** కి దరఖాస్తులు పంపుటకు **చివరి తేది 31 ఆగస్టు, 2019.** ఎన్ఐఎఫ్ పిల్లల సృజనాత్మకత మరియు ఇన్నోవేషన్ దినంగా జరుపుకునే మన మాజీ రాష్ట్రపతి దివంగత డా. ఎపిజె అబ్దుల్ కలాం గారి జయంతి రోజు (అక్టోబర్ 15)న విజేతల పేర్లు ప్రకటిస్తుంది.

అర్హమైనవి అని భావించిన ఇన్నోవేటివ్ ఐడియాలు/ప్రాజెక్టులను 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' గుర్తించి, వాటి అభివృద్ధికి, పేటెంట్‌కు సహకరిస్తుంది. 12వ తరగతి (10+ ఇంటర్మీడియట్) వరకు చదువుతున్న విద్యార్థులు (పాఠశాలేతర విద్యార్థులు, 17 సంవత్సరాల లోపు చిరంజీవులు కూడా) తమ ఎంట్రీలను తమ చిరునామా, పిన్ కోడ్, సెల్ ఫోన్‌తో సహా ఒక కాగితంపై వివరంగా వ్రాసి పోస్టు ద్వారా ఈ క్రింది చిరునామాలకు, లేదా ఈ–మెయిల్ ignite@nifindia.org ద్వారా పంపవచ్చు. ఆన్‌లైన్‌లో ద్వారా కూడా పంపవచ్చు.

**పూర్తి వివరాలకు సంప్రదించండి :**
**www.nif.org.in/ignite**

**National Innovation Foundation-India**
**Grambharati, Amarapur, Gandhinagar- Mahudi Road,**
**Gandhinagar - 382650, Gujarat, India.**
**Tel : 02764 261131/ 32/ 38/ 39, Fax : 011 43851803**
**E-mail : ignite@nifindia.org, web : www.nif.org.in/ignite**

# రైతులకు సేంద్రియ ఎరువు సరఫరాకై ప్రసాద్ ప్రయత్నం



అనంతపురం జిల్లా, ఉరవకొండ మండలం, ఆమిద్యాల గ్రామంలోని వ్యవసాయ కుటుంబానికి చెందిన గుడిశెల శంకరయ్య, భాగ్యలక్ష్మి దంపతుల ఇద్దరు కుమారులలో ప్రథమ పుత్రుడు 'గుడిశెల ప్రసాద్'. తన గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్య పూర్తయిన తర్వాత ఇంటర్మీడియట్ పూర్తి చేసి, డిగ్రీలో చేరాడు కాని, వ్యవసాయ కుటుంబం కావటంతో ఆర్థిక పరిస్థితులు సహకరించక ఒక సంవత్సరంతోనే డిగ్రీ విద్యను వదిలేసి తప్పనిసరి పరిస్థితుల్లో వ్యవసాయం వైపుకు మళ్ళాడు. తనది వ్యవసాయ కుటుంబమే అయినా అంతవరకు ప్రసాద్‌కు వ్యవసాయంపై పెద్దగా అవగాహన లేదు.

మామూలుగా ప్రతి యువకుడూ చేసినట్లుగానే గ్రామంలోని తోటి రైతులను గమనించి తాను కూడా రసాయన ఎరువులతోనే 2014లో వేరుశనగ పంట వేయటం జరిగింది. అప్పుడు మంచి దిగుబడులే వచ్చాయి కానీ, ఆ తరువాత నుండి వరుసగా దిగుబడి తగ్గుతూ రావటం, దీంతో పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగిపోవటం గమనించాడు.

ఈ పరిస్థితులలో ప్రసాద్ తనకున్న పరిజ్ఞానంతో అప్పుడప్పుడే ప్రాచుర్యంలోకి వస్తున్న పూర్వపు వ్యవసాయ పద్ధతులైన 'ప్రకృతి వ్యవసాయం'గురించి విని, తన సమీపంలో ఈరకమైన వ్యవసాయం చేస్తున్న రైతులను కలుసుకుని వివరాలు సేకరించాడు. అతను కలిసిన రైతులంతా ప్రకృతి వ్యవసాయం ప్రారంభించటం ప్రస్తుత పరిస్థితుల్లో చాలా అవసరం, కానీ ఈ వ్యవసాయంలో మొదట్లో దిగుబడి నిరాశాజనకంగా వుంటుంది, నిదానంగా మంచి ఫలితాలు వస్తాయి అని చెప్పారు. తన తండ్రితో ఈ విషయాన్ని గురించి చర్చిస్తే ప్రకృతిపద్ధతిలో వ్యవసాయం చేయటానికి అంగీకరించ లేదు. తల్లిదండ్రులను ఎదిరించలేక, వ్యవసాయాన్ని



వదిలేయలేక, ఎవరూ కౌలుకు తీసుకోవటానికి కూడా ముందుకు రాని నిస్సహాయ పరిస్థితికి లోనయ్యాడు ప్రసాద్.

నిరాశకు లోనవకూడదని ధైర్యాన్ని కూడగట్టుకుని, చూద్దాం, ప్రకృతి వ్యవసాయం ఎలా వుంటుందో అని తన పొలంలోనే జీవామృతం, నీమాస్త్రం లాంటి కషాయాలు తయారు చేసి వాటిని ఉపయోగిస్తూ వ్యవసాయ కార్యక్రమాలు మొదలు పెట్టాడు. మొదటి సంవత్సరం అసంతృప్తికి లోనయ్యాడు. అయినా నిరుత్సాహ పడలేదు. అప్పుడు తన పొలంలో పేడ ఎరువు మాత్రమే వేశాడు. ఆ తర్వాత 'వర్మీకంపోస్టు' ఎరువు తయారు చేసుకుని వేస్తే బావుంటుంది కదా అనుకుని, 450 చదరపు అడుగుల విస్తీర్ణంలో 4 అడుగుల వెడల్పు, 20 అడుగుల పొడవు, 2 అడుగుల ఎత్తులో రెండు వర్మీ కంపోస్ట్ బెడ్‌లను నిర్మించాడు. రెండువేల వానపాములను కొని అందులో వేసి, మొత్తానికి వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేసి దాన్ని వేరుశనగ పంటకు ఉపయోగించాడు. వేరుకుళ్ళు తెగులు రాలేదు, ఎకరాకు 25 బస్తాల దిగుబడి వచ్చింది.

దీని ఫలితం చూసిన తర్వాత రైతుల పరిస్థితిని అవగాహన అయ్యింది ప్రసాద్‌కి. ఏ పేపర్ తిరగేసినా రైతు ఆత్మహత్యలు, వారి కుటుంబ సభ్యుల ఆర్తనాదాల వార్తలతో చలించిపోయాడు. ఈ పరిస్థితుల్లో నేలను త్వరగా సారవంతం చేయగల శక్తి 'వర్మి కంపోస్ట్'కు ఉందని గ్రహించి, దీన్ని తానొక్కడు ఉపయోగించడం కాదు, తన పరిధిలోని రైతాంగం అంతా వినియోగించుకునేలా చేయాలని సంకల్పం చేసుకుని, ఇకపై రాయలసీమ నుండి ఏ రైతు వ్యవసాయం మానకుండా, వలసలు వెళ్లకుండా వ్యవసాయంలో కూడా లాభాలను ఆర్జించ వచ్చు అని నిరూపించాలన్న దృఢ సంకల్పంతో ముందుకు సాగాలనుకున్నాడు.





ఈ సేంద్రియ ఎరువును ప్రతి రైతు తయారు చేసుకోవచ్చు. కాకపోతే ప్రస్తుత వేగవంతమైన సమాజంలో చాలామంది రైతులు దీన్ని తయారు చేసుకోలేక గతిలేని పరిస్థితుల్లో రసాయన ఎరువులనే వినియోగిస్తూ కష్ట, నష్టాలకు గురౌతున్నారు. ఈ పరిస్థితి మార్చి, యావత్ రైతాంగానికి ఈ ఎరువును చవకగా అందించాల్సిన అవసరం ఎంతైనా వుందని గ్రహించిన ప్రసాద్ దీన్ని ఎలాగైనా సరే అందరు రైతులకు అతి తక్కువ ధరలో అందించే ఏర్పాటు చేయాలనుకున్నాడు. ఇందుకు అనువైన వనరులు సమకూరితే వీలైనంత త్వరలో అందరు రైతులకు ఈ సకల పోషక విలువలు కలిగిన వర్మీ కంపోస్టు ఎరువు అందించాలన్నదే తన సంకల్పమని భావిస్తున్నాడు.

గుడిశెల ప్రసాద్ పల్లెసృజనతో తన ఆలోచనలను పంచుకున్నాడు. తాను మంచి నాణ్యమైన వర్మీ ఎరువును తయారు చేసి స్థానిక రైతులకు సమయానికి అందించాలన్న ఆయన కోరికను 'పల్లెసృజన' గౌరవించి, అన్ని రకాల సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నది. ఎవరైనా ఈ ప్రయత్నానికి తోడ్పడాలి అనుకున్న వారు పల్లెసృజనను (9866001678) సంప్రదించండి.

ఇతని ఆశయం నెరవేరాలని, యావత్ రైతాంగం రసాయన రహిత ఎరువులను వినియోగించి సమాజానికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడానికి 'పల్లెసృజన' తనవంతు సహాయ సహకారాలను ప్రసాద్‌కు అందిస్తుంది.

ఇన్నోవేటర్ : **గుడిసెల ప్రసాద్, ఫోన్ : 7416545661, 99592 48948.**

# ఇతర రాష్ట్రాల పల్లె కబుర్లు

**పశువులలో అతిసార నివారణకు చింతచెట్టు బెరడుతో చికిత్స:**
ఇన్నోవేటర్ : **మంజులాబేన్ ధీరూభాయ్ పటేల్**, భాతా ఫల్యా గ్రామం, ఖాట్వాడీ పోస్ట్ & తాలూకా, వాల్సర్ జిల్లా – 396385, గుజరాత్. **మొబైల్ : 099046 52689.**

కొన్నిసమయాలలో పశువులు పచ్చిమేత ఎక్కువగా తిని, లేదా చెడిపోయిన, కుళ్ళిపోయిన పదార్థాలు తిన్న ఫలితంగా అతిసార వ్యాధి బారిన పడుతుంటాయి. పేడలో దుర్భరమైన వాసన వుండి, రక్తము, చీము కూడా పడుతూ వుంటాయి. దీనికి సరియైన జాగ్రత్త తీసుకోకపోతే పశువు చనిపోయే ప్రమాదం కూడా ఉంది. దీని నివారణకై మంజులా బేన్ చింతచెట్టు బెరడును వాడుతుంది. ఆమె 500 గ్రా. చింతచెట్టు బెరడును తీసుకుని బాగా ఎండబెట్టి, కాల్చి బూడిద చేస్తుంది. రెండు చెంచాల ఈ బూడిదలో 300 మి.లీ. నీటిని జోడించి, బాగా కలిపి పశువుకి రోజుకి రెండుసార్లు చొప్పున



రెండు రోజులపాటు తాగిస్తుంది. దీంతో మంచి ఫలితం ఉంటుంది. తానీ పద్ధతిని తన తండ్రివద్ద నేర్చుకున్నానని, ఇప్పటికీ ఇదే వాడుతున్నానని చెప్పారామె. వైద్యం జరుగుతున్నపుడు పశువుచేత ఏవిధమైన పచ్చిదాణా తినిపించకూడదు. నీరు మాత్రం సమృద్ధిగా తాగిస్తూ వుండాలని జాగ్రత్తలు చెప్పిదామె.

**2. పశువు తిరిగి చూలుకు రాకపోతే నెమలి ఈకతో వైద్యం:**
ఇన్నోవేటర్ : **కాంజీభాయ్ ధాన్‌జీ ఠాకూర్,** టోరారా గ్రామం, హార్జీ తాలూకా, పాతాన్ జిల్లా. గుజరాత్. **మొబైల్ : 078742 95588.**

ఒకసారి ఈనిన పశువులు ఒక్కొక్కప్పుడు రెండవసారి చూలుకు రావటం ఆలస్యమవుతూ వుంటుంది. ఇటువంటి సందర్భాలలో తాను చెప్పిన చిట్కా వాడితే మంచి ఫలితం ఉంటుందని అంటున్నారు కాంజీభాయ్. నెమలి ఈకలోని



వెంట్రుకల కొసభాగాలను కత్తిరించి, సజ్జ రొట్టెలలో చుట్టి పశువుచేత తినిపించాలి. ఇలా ఒక్కసారి మాత్రమే చేయాలి. దీనివలన పశువు తిరిగి చూలుకు వచ్చే అవకాశాలు మెరుగుపడతాయి.

ఈ పద్ధతిని మేమూ పరీక్షించి సఫలీకృతమైనామని చెప్తున్నారు ప్రతాప్‌జీ ఠాకూర్, కాలోజీ ధాంజీ ఠాకూర్, కానాభాయ్, ఖేంగాభాయ్, బార్వాద్‌లు.

**3. వంగ తోటలో ఆకుముడత పురుగు నివారణ:**
ఇన్నోవేటర్ : **ముఖేష్ భాయ్ అమతాభాయ్ రబారీ,** బిలియా గ్రామం, సిద్ధాపూర్ తాలూకా, పాతన్ జిల్లా. గుజరాత్. **మొబైల్ : 096381 95920.**

వంగ తోటల్లో ఆకుముడత పురుగు పెద్ద సమస్యగా వుంటుంది. వాతావరణం మబ్బుగా వుండి, మంచు ఎక్కువ కురుస్తున్న ప్రదేశాలలో రసం పీల్చే పురుగు చేరి అది ఆకుముడతకు దారి తీస్తుంది. దీనివలన వంగచెట్టు కొత్త ఆకులు వేయలేదు, చిగురు కూడా రాదు. పర్యవసానంగా పంట దిగుబడి దెబ్బతింటుంది. ఇటువంటి పరిస్థితుల్లో ముఖేష్ భాయ్ రాబరి జిల్లేడు, గన్నేరు, గోమూత్రం, నాచు ఉపయోగించి స్వంతంగా క్రిమి సంహారణిని తయారు

## పశు సంపదను కాపాడుకుందాం

పాఠకులకో మనవి. మారుతున్న కాలంలో సాంప్రదాయ పశువైద్యులు కనుమరుగై పోతున్నారు. అక్కడక్కడా వున్న వారి జ్ఞానం వారితోనే అంతం కాకుండా భవిష్యత్ తరాలకు అందించాలంటే అటువంటి వైద్యాలు గ్రంథస్తంచేయటం ఎంతో అవసరం. మీకు తెలిసిన పశువైద్యులు ఎవరైనా వుంటే వారి జ్ఞానాన్ని మాతో పంచుకోండి. ప్రచురించి అందరికీ అందజేద్దాం. **- ఎడిటర్**



చేసుకున్నాడు.

దీనికై రెండున్నర కిలోల జిల్లేడు ఆకులు, రెండున్నర కిలోల గన్నేరు ఆకులను మెత్తగా నూరి, ఆ మిశ్రమానికి 10 లీటర్ల నీటిని జోడించి సన్నని సెగపై చాలాసేపు మరగనివ్వాలి. చల్లారిన తర్వాత ఆ మిశ్రమంలో రెండున్నర లీటర్ల గోమూత్రము, ఒక కిలో నాచు/ పాచిని కలిపి 24 గంటలసేపు కదలకుండా ఉంచాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని వడకట్టి, 500 మి.లీ. ద్రావణాన్ని పంటపై పిచికారి చేయాలి. ఈవిధంగా రోజు విడిచి రోజు చొప్పున ఆరు రోజులపాటు పిచికారి చేయాలి. దీనితో పంటను ఆశించిన తెగులు నశించి కొత్త చిగురు వేసి పంట పూతకు వస్తుంది.

చుట్టుప్రక్కల రైతులు కూడా ఈ ద్రావకం పనితీరును గమనించి తాముకూడా తమ పంటల్లో ఉపయోగిస్తున్నారు. నాచు, పాకుడుని తప్పనిసరిగా 24 గంటలసేపు ద్రావకంలో తప్పనిసరిగా ఉంచటం వలన మంచి ఫలితాలు వస్తాయట. పిచికారి చేసేటప్పుడు ఆకులన్నీ పూర్తిగా తడిసేలా తగు జాగ్రత్త తీసుకోవాలి

ముఖేష్‌భాయ్ రాబరీ తనకున్న 5 బీగాల పొలంలో కాయగూరలే కాక, పశువులకై గడ్డిని కూడా పెంచుతూ వుంటాడు. మూడవ తరగతి వరకే చదువుకున్న ఇతను గత 32 సంవత్సరాలుగా కొత్త విషయాలను తెలుసుకుని సేంద్రియ వ్యవసాయంలో కొత్త పద్ధతులను అవలంభిస్తూ వుంటాడు.

**4. కాయగూరల్లో తెల్లదోమ నివారణకు మందు:**

ఇన్నోవేటర్ : **మంగళ్‌భాయ్ ధాంజీభాయ్ బోయా,** తనికీ గ్రామం, ధర్మపూర్ తాలూకా, వాల్సాద్ జిల్లా. గుజరాత్.
మొబైల్ : **097242 50739.**



ప్రత్యేకించి చలికాలంలో చిక్కుడు మరియు ఇతర కూరగాయల పంటలకి తెల్లదోమ, రసంపీల్చే ఆకుపచ్చ పురుగులు సాధారణంగా ఆశిస్తూ వుంటాయి. నీరుపెట్టే పంటలపై ఇవి ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. ఇటువంటి పరిస్థితి వచ్చినపుడు మంగళ్‌భాయ్ బూయా వేపాకు, గోమూత్రంతో క్రిమి సంహారక మందును తయారు చేసుకుంటూ వుంటాడు. ఆయన తన వంగ, చిక్కుడు పొలంలో ఈ తెల్లదోమ, రసంపీల్చే పురుగులు కనిపించినప్పుడు 5 కిలోల సన్నగా తరిగిన వేపాకులను 10 లీటర్ల నీటిలో కలిపి 2 రోజులు మురగబెడతాడు. ఆ తర్వాత ఈ ద్రావకాన్ని వడకట్టి ఈ మిశ్రమానికి 3 లీటర్ల గోమూత్రాన్ని కలుపుతాడు. 3 లీటర్ల ఈ ద్రావకాన్ని పురుగు సోకిన పంటపైన మూడురోజులకొకసారి చొప్పున పురుగు నశించేంత వరకు పిచికారి చేస్తూ వుంటాడు. కొన్ని సమయాలలో ఈ రసంపీల్చే పురుగు నాశనం కాకపోయినా, ఈ మందులోని చేదు రుచి వలన అవి మొక్కల రసాన్ని పీల్చటం మానేస్తాయి. గోమూత్రం క్రిమి సంహారిగానే కాకుండా మొక్క ఎదుగుదలకు కూడా సహాయకారిగా వుంటుంది. ఈ పద్ధతిని తమ పూర్వీకులనుండి పాటిస్తున్నామని చెప్తున్నాడు మంగళ్‌భాయ్. ●

## గ్రామీణ సృజనాత్మక శక్తికి వేదిక 'పల్లెసృజన'

'పల్లెసృజన' ఒక వేదికగా ఉపయోగపడాలంటే మీరు మీ సమస్యలను, ఆలోచనలను, జ్ఞాన సంపదను సంకోచించకుండా మాకు పంపండి. ఎంత చిన్న ఆలోచన అయినా సరే మేము ఆహ్వానిస్తాం. మీ సమస్యలను 'పల్లెసృజన'లో ప్రచురిస్తాం. వాటికి పాఠకులు సమాధానాలు పంపితే వాటిని కూడా ప్రచురిస్తాం. మన సమస్యలు బహిరంగ వేదికపై పెట్టి సమాజం నుండి పరిష్కారాలను ఆహ్వానించడమే 'పల్లెసృజన' ఉద్దేశ్యం. అందరూ సహకరించి ఈ గ్రామీణ సృజనాత్మక శక్తి వెలుగుదారుల వేదికను సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాం.

-ఎడిటర్

# ఆయుర్వేద జ్ఞాన మథనం

# తులసి - సకల సద్గుణ రాశి

'తులసి' పేరు వినని వారు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో, ఆ మాటకొస్తే యావత్ భారత దేశంలో ఉండరు. హైందవ సాంప్రదాయంలో తులసికి అంతటి ఘనమైన గౌరవం ఏర్పరచుకున్న జాతి మనది. దానికి కారణం మన పురాణాల ప్రకారం 'భగవంతుడికి అత్యంత ప్రీతిపాత్రమైనది తులసి' అనేది ఆస్తికుల వాదనయితే, ఇందులో గల అత్యధిక ఔషధ గుణాలు మనిషి జీవనానికి ఎంతో ఉపయోగకరమైనవన్న వాదన నాస్తికులు, ఆయుర్వేద వైద్యులే కాదు, సకల జనులు చెప్పేది. ఔషధ గుణాలు కలిగిన మొక్కల పేర్లు చెప్పమంటే మొట్టమొదటగా ఉచ్ఛరించేది 'తులసి' మాత్రమే. అటువంటి తులసి గుణ గణాలను గురించి తెలుసుకుందాం.

'తులసి'కి ఒక కోట కట్టి, అందులో తులసి మొక్కను ఒక దేవతా స్వరూపంగా భావించుకుని దానికి అనునిత్యం పూజలు చేయటం చాలా హైందవ కుటుంబాల్లోని స్త్రీల సదాచారం. ఈ తులసి చెట్లలో కూడా రకాలున్నాయి. లక్ష్మి తులసి, కృష్ణ తులసి, రామ తులసి ఇలా నాలుగైదు రకాలున్నాయి. అయితే వీటిలో లక్ష్మి తులసి పచ్చరంగులోను, కృష్ణ తులసి నల్ల రంగుతో వుంటాయి, ఈ రెండింటిని ప్రధానంగా చూస్తుంటాము. ఇక ఈ తులసి యొక్క వైద్య గుణాల వివరాల్లోకి వెళ్తే.....

తులసి ఆకు రసం తీసి చెవిలో రెండు మూడు చుక్కలు వేసుకున్నట్లయితే ఎటువంటి చెవి నొప్పి అయినా



లక్ష్మి తులసి

ఐదు లేదా పది నిమిషాల్లో తగ్గిపోతుంది. ఇది చెవికి ఎటువంటి హాని కలుగనీయదు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్‌లు కూడా వుండవు.

నోటి సంబంధిత జబ్బులను సమర్థవంతంగా నివారిస్తుంది తులసి. కఫం, వాతం, నోటి రుచి లేని వారికి రుచిని పుట్టించటం, ఆకలి గుణాన్ని పెంచటం లాంటి ఎన్నో గుణాలు కనిపిస్తాయి. పురుషులు 4 లేదా 5 ఆకులను తీసుకోవచ్చు, స్త్రీలు 1 లేదా 2 ఆకులను తీసుకుంటే మంచిది. దీన్ని అనునిత్యం చేయవలసిన అవసరం లేదు, నాలుగైదు రోజులకోసారి ఇలా చేస్తే ఆరోగ్యంగా వుండవచ్చు.

తులసి వున్నచోట దోమలు రావు. అందుకే పూర్వం చాలా పెరటి తోటల్లో తులసి మొక్కలను విరివిగా పెంచేవారు. ఈ తులసి చెట్ల వాసన దోమలకు అలర్జీ కాబట్టి దోమలు ఆ దరిదాపుల్లో వుండవు. దీన్నిబట్టి చూస్తే రైతులు కూడా తమ పొలం గట్లవెంట తులసి మొక్కలను పెంచుకోవటం మేలేమో ఎవరైనా ప్రయోగించి చూస్తే బావుంటుంది.

శరీరంలో రక్తహీనత వున్న వారు ఎవరైనా సరే రోజుకు నాలుగైదు తులసి విత్తనాలను నోట్లో వేసుకుని నమిలి తిన్నట్లయితే రక్త హీనత నుండి బయట పడవచ్చు.

ముక్కుదిబ్బడ వున్నవారు, ముక్కు వ్యాధితో విపరీతమైన ఆయాసం, ఊపిరి తీసుకోలేని వారు తులసి ఆకులను చేతితో నలిపి వాసన చూస్తూ వున్నట్లయితే, లేదా తులసి ఆకులను కొన్నింటిని మెత్తగా నలిమి ఒక గుడ్డముక్కలో వేసుకుని వాసన చూసుకుంటూ వున్నట్లయితే త్వరలో ఉపశమనం పొందవచ్చు.

చిన్న పిల్లలకు కడుపు నొప్పి వచ్చినపుడు ఒకటి రెండు తులసి ఆకుల రసాన్ని తీసుకుని తేనెతో కలిపి నోట్లో వేసినట్లయితే శీఘ్రంగా ఉపశమనం పొందవచ్చు.

కొందరికి అదేపనిగా గొంతు బొంగురు పోతూ వుంటుంది. అటువంటి వారు ఒక చెంచా తులసి ఆకుల రసాన్ని ఒక చెంచా నిమ్మరసంతో కలిపి సేవించినట్లయితే త్వరలో ఉపశమనం పొందవచ్చు.

నీరసంగా వుండి మంచపై నుండి లేవటానికి కూడా ఇబ్బంది పడుతున్న వ్యక్తులు ఒక తులం సాలామిస్రి,

యాలకుల పొడి ఒక చిటికెడు, ఒక చెంచాడు తులసి రసం కలిపి గ్లాసు నీటిలో వేసి తీసుకున్నట్లయితే చాలా త్వరగా ఉపశమనం పొంది హుషారుగా లేచి తిరగవచ్చు.

తులసి ఆకుల రసాన్ని ఒకటి రెండు చెంచాలు గ్లాసు నీటిలో కలిపి నాలుగైదు రోజులకోసారి తీసుకున్నట్లయితే ఉదర సంబంధ వ్యాధులన్నీ నయమౌతాయి. ప్రేవులలోని కల్మషం కూడా మలం ద్వారా కొట్టుకొని పోతుంది. అంతే కాదు ముఖ వర్చస్సు కూడా పెరుగుతుంది.


గొంతువాపు, ఇన్‌ఫెక్షన్ వున్నవారు తులసి ఆకు రసం రెండు చెంచాలు ఒక చెంచాడు మిరియాల పొడిని కొద్దిగా నీటిలో కాని, పాలలో కలిపి సేవించినట్లయితే త్వరగా ఉపశమనం పొందవచ్చు.

పాముకాటు సంభవించినపుడు కొన్ని తులసి ఆకులను నలిపి రసం తీసి పాముకాటుకు గురైన వ్యక్తిచేత తాగించినట్లయితే రెండు మూడు గంటల పాటు పాము విషం ఎక్కడ కరిచిందో అక్కడే వుండేలా చేస్తుంది. ఈలోగా వైద్యుని వద్దకు తీసుకువెళ్ళ గలిగితే ఎటువంటి హాని వుండదు. అంటే పాముకాటుకు గురైన వ్యక్తికి ఇది ప్రాథమిక చికిత్సలా పని చేస్తుందన్నమాట.

బలహీనంగా వున్నవారు తులసి చెట్టు వేర్లను మెత్తగా నూరి నేతిలో కలిపి తీసుకున్నట్లయితే త్వరలో బలంగా తయారౌతారు.

తులసి ఆకుల కషాయం అన్ని రకాల జ్వరాలకు దివ్య ఔషధంగా పని చేస్తుంది. కొన్ని తులసి ఆకులను తీసుకుని మెత్తగా దంచి, కొద్దిగా నీటిని కలిపి ఆ నీరు సగం అయ్యే వరకు కాగబెట్టినట్లయితే తులసి కషాయం తయారౌతుంది. ఇది దాదాపు సర్వరోగ నివారిణిగా కూడా పని చేస్తుంది.

కృష్ణ తులసి వేర్లను కషాయం చేసుకుని రోజు కొద్దిగా తీసుకున్నట్లయితే క్యాన్సర్ వున్నవారి ఆ రోగం అంతకన్నా



కృష్ణ తులసి



రామ తులసి

పెరగకుండా అలాగే వుంటుందని ఇటీవల కొన్ని ప్రయోగ సంస్థలు వెల్లడించాయి.

ఆరు వేపాకులు, ఆరు పిచ్చిదొండ ఆకులు, ఆరు తులసి ఆకులు కలిపి నోట్లో వేసుకుని బాగా నమిలి రసం మింగినట్లయితే మధుమేహం ఎప్పుడూ నియంత్రణలో వుంటుంది. ఇది పూర్వం నుండి అనుసరిస్తున్న వైద్య విధానం.

మార్కెట్లో సబ్జ గింజలు లభిస్తాయి. వాటితో పాటు కొన్ని తులసి విత్తనాలను కలిపి నీటిలో నానబెట్టి తీసుకున్నట్లయితే శరీరంలోని వేడిని తగ్గించడమే కాక, చాలా రోగాలను నియంత్రణలో వుంచుతుంది.

మరణశయ్యమీద వున్న వారికి తులసి తీర్థం ఇస్తూ వుండటం చాలామంది గమనించి వుంటారు. అలా చేయటం వల్ల ఏ పుణ్యాత్ముడి చేతితో ఇచ్చిన తీర్థం ప్రభావం వల్లనో లేదా వారికి ఇష్టమైన వారు ఇచ్చిన తీర్థం వల్లనో పుణ్య లోకాలకు వెళ్ళిపోతారని, లేదా బ్రతికిపోతారని ఇలా చేస్తూ వుంటారు.

ఏదిఏమైనా తులసి ఎన్నో రకాల వైద్యాలలో ప్రధాన ఔషధంగాను కొన్ని వైద్యాలలో సూచనప్రాయంగాను పనిచేస్తూ వుంటుంది. మొత్తానికి తులసి ఏవిధంగా తీసుకున్నా మానవ శరీరానికి మేలు చేస్తుందే కాని, కీడు మాత్రం చేయదు అన్నది నగ్నసత్యం. అందుకే ఈ చెట్టు హైందవ జాతిలో పూజార్హత పొందింది.

**పలివెల ఉమా మహేశ్వర రావు,** ఆయుర్వేద వైద్యులు,
మణుగూరు, ఖమ్మం జిల్లా. ఫోన్ : 94402 86854

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయష్కరం.

ఎడిటర్ గారికి,

నేను హైదరాబాద్‌లో 20 సంవత్సరాల క్రితం ఒక టిఫిన్ సెంటర్లో టిఫిన్ చేస్తూ అక్కడ రాసిన "అన్నం పరబ్రహ్మ స్వరూపం" అన్న కొటేషన్ నేనెప్పుడూ మర్చిపోలేదు. నిజానికి నాలుగు మెతుకులు మన నోట్లోకి వెళ్ళడం వెనుక అవి ఆహారంగా మారడానికి ఎంతో శ్రమ, ప్రయాస ఉంటుంది. ప్రకృతికి తట్టుకొని పంటగా మారి, ఆహారంగా మారి కంచంలోకి రావడానికి ఎంతమంది చెమట చుక్కలు రాల్చాలి! గింజ గింజ కలిపి రాశి పేర్చే రైతన్న కష్టం మామూలుది కాదు. ఆ ఆహారం దొరకక ప్రపంచంలో చాలా దేశాల్లో రోజూ ఆకలి చావులకు గురవుతున్నారు. అందుకే 'అన్నం వృధా చేయొద్దు' అన్న మాట నాకెంతో ఇష్టం. గత సంచికలో ప్రచురించిన లింగాల కేదారి గారి వ్యాసం నన్నెంతో ఆకట్టుకుంది. ఇంతటి మహత్తర కృషి చేస్తున్న కేదారి గారికి పల్లెసృజన ద్వారా నా ధన్యవాదాలు తెలియజేస్తూ, ఇలాంటి ఒక వ్యక్తి కథనాన్ని వెలుగులోకి తెచ్చిన 'పల్లెసృజన' బృందాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

**– బాల్‌రెడ్డి అనుగు,** ఫేస్‌బుక్ ద్వారా ......

బాల్‌రెడ్డి గారికి,

ధన్యవాదములు. మీలాంటి వారి మనసు చూరగొన్న ఈ కథనం వెనక మా శ్రమ ఫలించినట్లే అయింది. ఎప్పుడైనా మీరు వరంగల్ వెళితే తప్పక అక్కడ భోజనం చేసి, మీ అభిప్రాయాలు మాతో పంచుకుంటే ఇంకా సంతోషిస్తాము.

**– ఎడిటర్.**

ఎడిటర్ గారికి,

పల్లెసృజన గురించి చాలాసార్లు విన్నాను. ఆ పత్రిక చందా వివరాలు తెలుపగలరు. అలాగే ప్రస్తుతం చాలామంది రైతుల చేతుల్లో టచ్ మొబైల్ ఫోన్లు వుంటున్నాయి. అందువల్ల ఎన్నో వ్యవసాయ వాట్స్‌యాప్ గ్రూపుల ద్వారా కొత్త కొత్త విషయాలను తెలుసుకుని రైతు పురోభివృద్ధి బాటలో పయనిస్తున్నాడు. పల్లెసృజన పత్రిక ఇ–మేగజైన్ ద్వారా వాట్స్ యాప్‌లో పంప గలిగితే ఎంతోమంది రైతులకు ఇది ఉపయోగ కారిగా వుంటుందని నా అభిప్రాయం. ఇ–మేగజైన్ చందా వివరాలు తెలిపితే నేను నావంతు కృషిగా మా వాట్స్‌యాప్ గ్రూపులో అందరు రైతులకు తెలియజేసి అందరూ చందాదారులుగా అయ్యేలా ఆలోచిస్తాను.

**– చౌదరి,** తాడిపత్రి, అనంతపురం జిల్లా.

చౌదరి గారూ,

మీ అభిమానానికి ధన్యవాదములు. మీరు చాలా మంచి సలహా ఇచ్చారు. ఇ–మేగజైన్ గురించి ఆలోచిస్తాము. ప్రస్తుతం మీరు పల్లెసృజన చూడాలనుకుంటే www.pallesrujana.org వెబ్‌సైట్‌లో చూడవచ్చు. మీ మిత్రులకు కూడా తెలియజేయండి. ఈవిధంగా 'పల్లెసృజన' ప్రతి గ్రామాన్ని చేరాలన్న మా కోరిక కొంత వరకు నెరవేరుతుందని అనుకుంటున్నాము.

**– ఎడిటర్**


## FORM IV

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA) to be published in the first issue every year after the last day of February***

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,** Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Teelangana |
| 2. | Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. | Printer's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | Indian |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 4. | Publisher's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 5. | Editor's Name | : | **J. Seshi Mohan** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

I, **P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

**Signature of Publisher**

## రైతుల కోసం రైతులు తయారు చేసిన ఇన్నోవేషన్లు

# నిమటోడ్స్ నివారణకు వనమూలికలతో పురుగు మందు

'పల్లెసృజన' ఇన్నోవేటర్ "గల్లా చంద్రశేఖర్" తయారు చేసిన "నిమటోడ్స్" పురుగు మందు అద్భుతంగా పని చేస్తుందనటానికి మరో ఉదాహరణ పాఠకుల కోసం అందిస్తున్నాము.

కర్నూలు జిల్లా కల్లూరు మండలం లోని 'బొల్లవరం' అనే గ్రామానికి "జాంపండ్ల బొల్లారం' అనే పేరుండేది. ఆ గ్రామం నుండి ఒకప్పుడు రోజుకు రెండు బస్సులు/ లారీలు కేవలం జాంపండ్లను సమీపంలోని కర్నూలు లేదా ఇతర మార్కెట్లకు సరఫరా చేసేటంతటి చరిత్ర ఆ గ్రామానిది. ఆ గ్రామానికి తూర్పు వైపున తుంగభద్రానదికి ఉపనదియైన 'హంద్రీనది' ప్రవహిస్తూ వుంటుంది. ఈ హంద్రీనది ఒడ్డు పొడవునా జామచెట్లతో ఆ గ్రామం శోభాయమానంగా ఉండేది. అటువంటి గ్రామానికి ఎవరో చేతబడి చేసినట్లు కొన్ని వందల సంవత్సరాల వయస్సున్న చెట్లతో సహా గ్రామంలోని జామ చెట్లన్నీ కేవలం రెండు మూడు సంవత్సరాల్లో సమూలంగా చనిపోయాయి.

ఆ తర్వాత ఇక మన ఊరిలో జామచెట్లు బ్రతకవు అని ఆ పొలాన్నంతా కూరగాయలు, ఇతర పంటలు వేసుకుంటూ జీవనం సాగించారు ఆ గ్రామ రైతులు. దాదాపు పదేళ్ళ తర్వాత ఒకప్పుడు ఇంతటి ఆర్థిక పుష్టిని కలిగించిన జామచెట్లను మళ్ళీ పెంచుదామని కొందరు యువ రైతులు పూనుకున్నా అవి కూడా కొన్ని చనిపోతూ వచ్చాయి. గ్రామంలోని 'సుగాలి మస్తాన్' అనే యువ రైతు మూడు నెలల క్రితం జామచెట్లు నాటాడు. వాటిలో పదిహేను దాకా చనిపోయాయి అని తన గ్రామవాసి అయిన 'పల్లెసృజన' పల్లె వీరరాఘవ రెడ్డితో చెప్పాడు. రాఘవరెడ్డి వెంటనే తనవద్ద సిద్ధంగా వున్న చంద్రశేఖర్ నిమటోడ్స్ నివారణ మందు ఇచ్చి 'వెంటనే దీన్ని నీ చెట్లన్నిటికీ చల్లెయ్యి' మని సలహా ఇచ్చాడు. సుగాలి మస్తాన్ తన జామచెట్లన్నిటికీ ఈ మందును ఇసకలో కలుపి చల్లి, నీరందించాడు.

జామచెట్లకు మందు చల్లిన వారం రోజుల తర్వాత ఆ రైతే ఆశ్చర్యపోయేట్లుగా పూర్తిగా చనిపోయినవి అనుకుని, కేవలం కర్రలు (మోడులు) మాత్రమే మిగిలి వున్న చెట్లన్నీ మళ్ళీ ఇగుర్లు వేయటంతో తన ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బై వెంటనే రాఘవరెడ్డికి ఫోన్ చేసి "రెడ్డీ చనిపోయాయి అనుకున్న నా జామచెట్లన్నీ లాకలు వేయటమే కాదు, తోట కూడా మంచి రంగులో నిగనిగలాడుతుంది" అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు. మూడు నెలల తర్వాత కూడా సుగాలి మస్తాన్ తోట పచ్చగా పెరుగుతూ వుంది.

'రాష్ట్రపతి పురస్కార గ్రహీత' చంద్రశేఖర్ గారి 'నిమటోడ్స్ నివారణ' మందును ఉపయోగించుకుని రైతులు బత్తాయి, జామ, మిరప, వేరుశనగ, కూరగాయలు, పూలు, మొక్కజొన్న వగైరా పంటలను కాపాడుకుంటారని ఆశిస్తోంది 'పల్లెసృజన'.

రైతు పేరు : **మస్తాన్ నాయుడు, బొల్లవరం గ్రామం, కల్లూరు మండలం, కర్నూలు జిల్లా.**

ఫోన్ నెం. : **9963368834/ 6300223241**







కావాల్సిన వారు సంప్రదించండి :
**పల్లెసృజన,** ప్లాట్ నెం. 77, రోడ్ నెం.2, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ – 500 094.
ఫోన్ : **8125799904, 9652801700**

PALLESRUJANA Telugu Bi-monthly January - February 2019 RNI No. TELTEL 2012/74620



# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే











పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

**చందా వివరాలు**

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| రెండు సంవత్సరాలకి | 350/- | 1,400/- |
| ఐదు సంవత్సరాలకి | 800/- | 3,200/- |

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 9866 00 1678, 96528 01700
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.

మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023

Narendra Grafix, Hyd. Ph.: 81257 99904